
# మిసిమి

మాస పత్రిక

అక్టోబర్ - 2005



రూ.8/-



# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 16 అక్టోబర్ 2005 సంచిక 10

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

| | |
|---|---|
| గాంధీమతం | మూలం : గాంధీ<br>అనువాదం : అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి |
| కవిత్వం-కవిత్వాల్లో ఉంటుంది, కాని, దాని గురించి ఇచ్చే ఉపన్యాసాల్లో, రాసే వ్యాసాల్లో ఉండదు... | మూలం: విష్ణుడే<br>అనువాదం డా॥ జె. లక్ష్మిరెడ్డి |
| బతుకమ్మ పండుగ - తెలంగాణ పండుగ | కాంౘ్రేగుల నాగేశ్వరరావు |
| మనిషి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న విద్యుత్ పరికరాలు | సి.వి. సర్వేశ్వర శర్మ |
| భవభూతి కరీంనగర్ ప్రాంతీయుడా? | డా॥ సంగనభట్ల నరసయ్య |
| మార్క్విజ్ డి శేడ్ - శేడిజం | బి.వి. రామిరెడ్డి |
| డా॥ సంజీవదేవ్ భావ సాంద్రత - పరిణామాలు : ఒక పరిశీలన | ముంగర జాషువా |
| అమరత్వంపొందిన 74 యేండ్ల అనంతరం భగత్‌సింగ్ లక్ష్యాలు, వ్యక్తిత్వంపై కొద్దిగా | వి.ఆర్. బొమ్మారెడ్డి |

విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : **బతుకమ్మ పండుగ**

ఛాయాగ్రాహకుడు : **జి. భరత్ భూషణ్**

Printed & Published by **Bapanna Alapati**, at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# గాంధీ మతం

(సర్ రాధాకృష్ణన్ లేఖకు గాంధీ రాసిన సమాధానం)

సర్ రాధాకృష్ణన్ నన్ను ఈ దిగువ ప్రశ్నలకు సమాధానం చెప్పమని కోరారు :

1. మీ మతం ఏమిటి?

2. మీరు దానిని ఎలా చేరుతున్నారు?

3. సామాజిక జీవితం మీద దాని ప్రభావం ఏమిటి?

నా మతం హిందూ మతం. నా వరకు అది మానవాళి మతం. నాకు తెలిసిన అన్ని మతాల లోని "మంచి" అందులో ఉంది.

రెండో ప్రశ్న కావాలనే, భూతకాలంలో కాక, వర్తమాన కాలంలో అడిగారు. నేను నా మతాన్ని సత్యాహింసల ద్వారా చేరుతున్నాను. అంటే విస్తృతార్థంలో అది ప్రేమ. నేను తరచు నా మతాన్ని సత్య మతమని వర్ణిస్తాను. ఈ మధ్య నేను, 'దేవుడే సత్యమని' చెప్పడానికి బదులుగా 'సత్యమే దేవుడు' అని చెబుతున్నాను. ఇలా చెబితే నా మతాన్ని బాగా, నిండుగా వ్యక్తీకరించినట్లవుతుంది. ఒకప్పుడు నేను హిందూ మత గ్రంథం 'విష్ణు సహస్రనామా'న్ని కంఠత చెప్పేవాణ్ణి. నేనే కాదు బహుశ వేలకు వేల హిందువులు దానిని ప్రతి దినం జపిస్తారు. కాని నేడో, నా దేవుణ్ణి 'సత్యం' వర్ణించినంత సంపూర్ణంగా మరేదీ వర్ణించలేదు. దేవుణ్ణి కాదనడం మనకు తెలుసు. కాని సత్యాన్ని కాదనడం మనం ఎరగం. మానవాళిలో అత్యంత అవిద్యాపరులలో గూడ ఏదో కొంత సత్యం ఉంది. మనం అంతా ఆ సత్యం తాలుకు మెరుపులం. దేవుడనే ఒక అజ్ఞాత సత్యాన్ని వర్ణించలేని విధంగానే, ఈ మెరుపుల మొత్తం రాశిని మనం వర్ణించలేం. నేను అనునిత్యమూ, నా నిరంతర ప్రార్థన ద్వారా దానిని చేరుతున్నాను.

ఈ సామాజిక జీవితం మీద ఈ మత ప్రభావం ఉంది, ఉంటుంది. దీనిని ఒకడు తన దైనందిన సామాజిక సంస్పర్శ (Social contact)లో చూడవచ్చు. నిజంగా అటువంటి మతానికి ఒకడు విధేయుడై ఉండాలంటే, కొనసాగే, నిరంతర సామాజిక సేవలో అతడు తనను తాను పోగొట్టుకోవాలి (అందులో మునిగిపోవాలి). అందుకని నా వరకు నాకు సామాజిక సేవ నుంచి విముక్తి లేదు. ఈ భూమి మీద దానికంటె భిన్నంగా, దానికి దూరంగా మరో సుఖం లేదు. సామాజిక సేవ అంటే ఇక్కడ అర్థం జీవితానికి సంబంధించిన ప్రతి రంగాన్ని కలుపుకోవాలి. ఈ ప్రణాళికలో అల్పమైనదీ లేదు, అధికమైనదీ లేదు. ఎందుకంటే, మనందరం ఒక్కటే, అనేకంగా కనిపించినా.

తెలుగుసేత : అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి



# కవిత్వం-కవిత్వాల్లో ఉంటుంది కాని, దాని గురించి ఇచ్చే ఉపన్యాసాల్లో రాసే వ్యాసాల్లో ఉండదు...

1971 వ సం॥ జ్ఞానపీఠ్ సాహిత్య పురస్కార స్వీకారోపన్యాసంలోని ముఖ్యాంశాలు
(బెంగాలీ నుండి హిందీలోకి అనువదింపబడిన ఉపన్యాసానికి తెలుగు)

అనువాదం: డా॥ జె. లక్ష్మిరెడ్డి



విష్ణు డే
(1909-1983)

ఉపన్యాసాలివ్వడం నాకెప్పుడూ సానుకూలమైన పనిగా ఉండలేదు. కవి టి.ఎస్. ఇలియట్ ఆరోజుల్లో లండన్ బి.బి.సి.లో పని చేస్తూ ఉండిన జుల్ఫికర్ అలీ బుఖారీతో అన్నట్లుగా నేను కేవలం ఒక కవిని. కాలేజీలో ఉపన్యాసకుడుగా ఉండటం వల్ల 34 ఏండ్లు ఉపన్యాసం ఇస్తూ వచ్చాను. కాని దానికి, ఇలాంటి గొప్ప ఉత్సవ సందర్భాల్లో మాట్లాడటానికి, ఏమీ పొంతనలేదు.

బహుశా మేరియమ్ మూర్ అనుకుంటాను, చెప్పినట్లుగా, సంప్రదాయ విరుద్ధమైన ఆలోచనలను వ్యక్తపరచేటప్పుడు సంయమం పాటించాలి, అని నేను నమ్ముతూ వచ్చాను. బహిరంగ ఉపన్యాసాలలో అయితే ఈ నా నమ్మకం మరింత బలంగా ఉంటుంది. కాని దీని అర్థం వృద్ధా వస్థకు చేరుకునేప్పటికి కూడా నన్ను వ్యక్తీకరించే తగినన్ని గద్య పద్య రచనలు, నా దగ్గర లేవని కాదు. రచన నేను దాదాపు 50 సంవత్సరాల నుండి నిరంతరం కొనసాగిస్తూనే వచ్చాను.

ఆర్థికంగా కొంత వరకు తోడ్పడగలిగినా, అనామకంగా, వినమ్రతతో జీవించడంలోనే గౌరవం ఉందని భావించే రచయితను పురస్కారాలు, సన్మానాలు ఒక విచిత్రమైన చిక్కులో పడేస్తాయి. నా సాహిత్య జీవితంలోని విచిత్రమైన, వైపరీత్యం ఏమిటంటే నాకు ఇంత వరకు మూడు పురస్కారాలు లభించాయి. వాటిలో మూడవది 1971వ సంవత్సరానికి గాను లభించిన ఈ గొప్ప జ్ఞాన పీఠ పురస్కారం! నా అదృష్టంలో ఇలాంటిదే మరో విషయం కూడా ఉంది. యౌవనావస్థలో అతి ఆత్మ విశ్వాసం అహంభావంగా పరిణమించి ఉండినప్పుడు కూడా ఇంగ్లీషు, ఫ్రెంచ్ రచయితల సాహిత్య మార్గంలో నడచి చౌకబారు ఖ్యాతి పొందే ఆలోచన నాకు వెగుటు కలిగించేది. నిజం చెప్పాలంటే అదృష్టంలోని ఈ వైచిత్రి రుచిని నేను జీవిత పర్యంతం ఆస్వాదించాను. విద్యార్థి దశలో ఏ బాలకుడైతే రవీంద్రనాథ్ ఠాకూరు వ్యాసాలు చదివి అప్పట్లో అమలులో ఉన్న విద్యా విధానపు డొల్లు తనాన్ని తెలుసుకొని స్కూలు చదువు మానుకోవాలని గట్టి నిర్ణయం తీసుకున్నాడో, గొప్ప ఓర్పుగల తన తండ్రితో ఈ విషయాన్ని గురించి గంటల తరబడి వాదించాడో, ఆ బాలుడే, చివరకు తన వయస్క జీవితాన్ని పరంపరా బద్ధుడైన ఒక ఉపాధ్యాయుడుగా ఆరంభించవలసి వచ్చింది.

రచయితగా ఆ బాలుడు కౌమార్యంలో కూడా ఔద్ధత్యంతో కూడిన వాడుగా ఉండాలని కోరుకోకపోయినా, బహుమతులు గెల్చుకోవడానికి మామూలుగా అందరూ ఉపయోగించే పద్ధతులు అతనికి అనుకూలించవని మాత్రం నమ్మేవాడు. అయినా చూడండి. ఇప్పుడు నేను మీ ముందు నిల్చున్నాను! ఇది హాస్య వినోదాలతో కూడిన కుట్రగా లేదా? నన్ను చూసి మీరు చిరునవ్వు నవ్వినా, గట్టిగా నవ్వినా నేను చెడ్డగా భావించను. కాని, మీరు ఒక విషయం మాత్రం నమ్మండి. నేను

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులుగా పదవీ విరమణ చేశారు. నివాసం న్యూఢిల్లీ.

నాకున్న కొద్ది పాటి శక్తినంతా ఉపయోగించి నా పట్ల, నా పాఠకుల పట్ల నిజాయితీగా ఉండటానికి మాత్రం ప్రయత్నం చేశాను.

నన్ను చాలా సార్లు అడిగారు. నేను రచయిత నెలా అయానని. ఇది ఒక పెద్ద కథ. కారణం నా భౌతిక జీవితం కూడా చాలా పెద్దదే కాబట్టి. నా కవితా రచన ఆరంభదశ గుర్తుకు వస్తూంది. ప్రతిష్ఠాత్మకమైన ఒక పిల్లల పత్రిక ఒక చిత్రమాల పైన కవితలు రాసే పోటీ పెట్టింది. సర్వ శ్రేష్ఠమైన కవితకు బహుమతి కూడా ప్రకటించింది. లక్షరూపాయల బహుమతి కాదు లెండి. 10 లేక 20 రూపాయల బహుమతి. నేను పోటీలో పాల్గొన్నాను. దానికి రెండు కారణాలు. ఒకటి - అది ఒక నిర్దిష్టమైన విషయంపైన రాసే పోటీ కావడం. రెండవది (ఆ కారణం గురించిన అనుభూతి ఈ రోజు మరింత స్పష్టంగా కలుగుతూంది) దానికి బహుమతి కూడా ఉండటం. తిరిగి రావడానికి స్టాంపులు అంటించిన కవరుతో సహా నా కవిత్వం నేను పంపాను. దానికి జవాబు ఏమీ రాలేదు. కాని, ఆ క్షణం నుండి నా అన్వేషణా ప్రవృత్తి మేలుకొంది. 13-14 సంవత్సరాల వయసు వరకు నా రచన ఏదీ ప్రచురింపబడక పోయినా, రచనా వృత్తిలోని వినోద భావన, ప్రాసకోసం వెతకడంలో ఉన్న ఉల్లాసం, వేరు వేరు చందస్సుల్లో ఎన్నో విషయాల గురించి రాయడంలో ఉన్న ఆహ్లాదం ఇవి నాకు ఉత్సాహాన్ని, ప్రేరణను కలిగించాయి. ఇదంతా నాకు ఎలా ఉండేదంటే, ఒక కిశోరుడు రష్యా దేశపు విశాల పచ్చిక బయళ్ళలో, స్టెపీజ్‌లో గుర్రాలపైన సవారీ చేస్తున్నట్లుగా ఉండేది. అప్పుడే ఒక మహోన్నత పర్వతంలాగో, లేక ఒక గంభీర విశాల సముద్రంలాగో, సుస్థిర కాల పటలంపై చిత్రించిన దృశ్యావళులు నా ఎదుట నిలిచాయి. అవే రవీంద్రనాథుని అనవరత కార్యకలాపాలు. ఆ మహాశక్తి ప్రభావం ఇతరులను ఏ విధంగా సమ్మోహితుల్ను చేస్తుందో, అది నా లాంటి వంగ వాసికే బాగా తెలుస్తుంది. సూర్యుని తేజస్సు లాంటి ఆయన ప్రతిభ నిజంగానే దేశ ప్రేమకు సంబంధించిన ఒక విశ్వాన్నే నా ఎదుట ఆవిష్కరించి ఉంటుంది.

అగ్ర రచయితలు కొందరు ఈ యువ రచయిత ఛందో విన్యాసాన్ని ప్రశంసించే వారు. ఆ రోజుల్లో ఒక సందర్భంలో గొప్ప నాటకీయ ఉద్వేగంతో, చతురతా చాపల్యాలతో రాసిన 200 పుటల పద్యాలను చించి పారవేసినందుకు నన్ను నేను అభినందించుకుంటున్నాను.

చరమస్థాయి విపత్తును కూడా నేను అనుభవించాను. అది నరాల బిగువు సంబంధి. సంవత్సరం పైబడి నేను శారీరకంగా ఎంతో ఆరోగ్యంగా ఉండినా, నిద్ర పోగలిగే వాణ్ణికాదు. చాలా కాలం తర్వాత ఒక మంచి మనిషి, మంచి హృదయ రోగ నిపుణుడు అయిన ఒక డాక్టరు మా నాన్నతో ఆ నరాల బిగువు, ఆహ్లాదంతో కూడిన మనస్థితి వల్ల నా గుండె, కాలేయము దెబ్బతిన్నాయని చెప్పాడు. టి.ఎస్. ఇలియట్ రచించిన 'Poems-1925', 'Sacred Wood' నా ప్రగతి పథంలో రెండవ మజిలీలు అయాయి. నా డాక్టరు చెప్పిన మాటలు టి.ఎస్. ఇలియట్ కవితా పంక్తుల్లో ఎలా ప్రతిధ్వనించాయో చూడటం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

Lady, three white leopards sat under a juniper tree
In the cool of the day, having fed to satiety -
On my legs, my heart, my liver and that which had been contained
In the hollow round of my skull. And God said
Shall these bones live? shall these bones live?

కౌశల్యంతో కూడిన పద్యరచనా ధారావాహికలో నా మనఃస్థితి ఒక రకమైన అన్వేషణలో మునిగి జంకుతూ ఆగుతూ సాగే అభివ్యక్తిలా ఎలా మారుతూ పోయిందో, నాకు గుర్తుంది. ఒకానొక రాత్రి

దాదాపు పది పంక్తులు అకస్మాత్తుగా తమంతట తామే లిఖితమైనట్లుగా నా ఎదుటికి రావడం కూడా నాకు గుర్తుంది. ఆ పంక్తులే 8-9 సంవత్సరాల తర్వాత 'జన్మభూమి' అనే నా పెద్ద కవితలోకి ప్రవహించి విస్తరించాయి. అందులోనే అంతకు మునుపు సోక్రటీస్ కాలం నాటి ప్రసిద్ధ దేవత డాయోతిమాను సంబోధించి ఆమె తమోమయ యాత్రను వర్ణిస్తూ రచించిన కవిత కూడా కలిసి పోయింది. కలకత్తాలోని సమకాలీన జీవితాన్ని వర్ణించే ఆ కవిత నా మిత్రుడు, నా కంటే పెద్దవాడు అయిన సుధేంద్రనాథ్ దత్తాకు అంకితం ఇచ్చాను.

నేను మరొకందుకు కూడా కృతజ్ఞతతో టి.ఎస్. ఇలియట్‌ను గుర్తుచేసుకోవాలి. ఆయన పుస్తకం 'Tradition and Individual Talent' నా ఉన్నతిలో చాలా తోడ్పడింది. హోల్డర్లిన్‌కు విరుద్ధంగా మార్క్స్ రాసిన రచనలు ఆయన చదివి ఉంటే ఎంత బాగుండేది అని నాకు ఎప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. హోల్డర్లిన్‌కు మార్క్స్‌ను చదివే అవకాశం లేదు. అతడు మార్క్స్ కంటే ముందు పుట్టాడు కాబట్టి. కాని టి.ఎస్. ఇలియట్ కావాలంటే చదివి ఉండవచ్చు. అలా జరిగి ఉంటే ఆంగ్లో - అమెరికన్ సంస్కృతికి ఎంత మేలు కలిగి ఉండేదో! హైనరిక్ సోదరుడు థామస్ మాన్ కూడా ఇలాంటి ఆవేదననే వ్యక్తం చేశాడని మీకు తెలుసు. మాన్ లెనిన్ సాహిత్యాన్ని లోతుగా చదివి ఉంటే ఎంత బాగుండేది! ఇప్పుడు మన కందరికి తెలుసు ఆధునిక కళలకు మూలం ఏమిటి అని. ఆధునిక కళలో ఆధునిక కవిత కూడా చేరుతుంది. ఆధునిక జీవితం, ముఖ్యంగా విభజింపబడిన ప్రపంచం, ముక్కలైన సమాజం, ఇవన్నీ కోరుకునేది - వైరిటన్ ఒక చోట రాసినట్లు - కళా సృష్టిలో ఒక గొప్ప ఆత్మ చైతన్యం కలిసి ఉండాలని. ఆధునిక కవిత్వాన్ని గురించి వైలెస్ స్టివెన్సన్ ఇలా రాశాడు -

The poem of the mind in the act of finding
What will suffice. It has not always had
To find : The scene was set; it repeated what
was in the script
Then the theatre was changed...

To something else. Its past was a souvenir.

దాదాపు అర్వై సంవత్సరాల వరకు సాహిత్యం నిరంతరం అప్రమత్తంగా ఉండవలసి వచ్చింది. ఉదాహరణకు గాంధీజీ నడిపిన రాజకీయ ఉద్యమం, విషాదకరమైన ఆయన మరణము వ్యక్తికి కవిత్వం రాయడానికి తీవ్ర ప్రేరణ కలిగించాయి. జవహర్‌లాల్ నెహ్రూలోని హమ్‌లెట్ లాంటి గొప్పతనం కూడా అలాంటి ప్రేరణనే కలిగించింది. అలాగే నాకు లెనిన్ రష్యా, స్టాలిన్ సోవియట్ యూనియన్ ప్రేరణ నిచ్చాయనేది వాస్తవం. అంతేకాక వియత్‌నామ్ ప్రజల సాహసోపేత పోరాటాన్ని, బంగ్లాదేశ్ ఉద్యమాన్ని అభినందించకుండా ఎవరుండగలరు?

నేను నా గురించి చాలా మాట్లాడాను. అందుకు నన్ను నేను నియంత్రించుకోవలసి వచ్చిందంటే మీరు నమ్మండి. మీరు నన్ను క్షమించాలి. కవిత్వం కవిత్వాలలో ఉంటుంది కాని దాన్ని గురించి ఇచ్చే ఉపన్యాసాలలో గాని, రాసే వ్యాసాల్లోగాని ఉండదు. నేను మరోసారి మీ అందరికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**జీవిత విశేషాలు :**

విష్ణు డేకు ఆయన రచించిన 'స్మృతి సత్తా భవిష్యత్' అనే కవితా సంపుటికి 1971వ సంవత్సరపు భారతీయ జ్ఞాన పీఠ్ పురస్కారం లభించింది. ఈ కవితా సంపుటి 1960-1964 మధ్య కాలంలో

భారతీయ భాషల్లో వెలువడిన సృజనాత్మక సాహిత్య గ్రంథాల్లో సర్వ శ్రేష్ఠమైనదిగా ఎంపిక అయింది.

విష్ణు డే కలకత్తాలోని ఒక పేరు బడసిన కుటుంబంలో 1909లో జన్మించారు. మొదట సెంట్ పాల్ కాలేజీలోను, తర్వాత కలకత్తా విశ్వవిద్యాలయంలోను చదివి ఇంగ్లీషులో ఎమ్.ఎ. డిగ్రీ పొందారు. తన ఉపాధ్యాయ వృత్తిని 1935లో కలకత్తాలోని రిపన్ కాలేజీలో ఇంగ్లీషు ఉపన్యాసకుడుగా ఆరంభించారు. ఆ తర్వాత ప్రెసిడెన్సీ కాలేజీలో కొంత కాలం పనిచేసి చివరకు, ఇస్లామియా కాలేజీలో చేరి అక్కడి నుండే పదవీ విరమణ చేశారు. బెంగాలీలో కవిత్వం రాసిన ఆధునిక కవులందరిలో ఎక్కువ సంకీర్ణ వ్యక్తిత్వం ఉన్న కవిగా ఈయనను చెప్పుకుంటారు. మార్క్సువాద ఆలోచనా ధోరణితో రాసినా, ఆయన కవిత్వంలో ముఖ్యంగా కనిపించేది మానవతావాదంతో కూడిన వ్యక్తివాదం. వ్యక్తివాదికావడం వల్ల మానవ సమాజపు కలకలం నుండి, సంక్షోభం నుండి దూరంగా ఉండాలన్న తీవ్రమైన ప్రవృత్తి ఆయనలో ఉండేది.

దేశ విదేశాల గురించి, అక్కడి కళారూపాల గురించి తెలుసుకోవాలనే తీవ్రమైన కోరిక కూడా ఆయనకుండేది. ఫ్రాన్సు దేశస్తుడు, మార్క్సు వాది, కవి అయిన అరగోన్, ఆధునిక యూరోపు కవిత్వపు ప్రకాండ పండితులలో ఒకడుగాను, కవిత్వపు సిద్ధాంత కారుడుగాను భావించబడే ఫ్రెంచ్ కవి మలార్మే వీరిద్దరినీ కలిపితే విష్ణు డే దాదాపుగా తయారయినట్లే. రవీంద్రనాథ్ ఠాకూరు సాహిత్యం పట్ల, ఆయన ఆదర్శం పట్ల ఈయనకు ఎంతో భక్తి భావం కూడా ఉండేది. ఆధునిక పాశ్చాత్య ఆలోచనా ధోరణిని బలంగా స్వీకరించిన విష్ణు డేకు ఇది ఎలా సాధ్యమో, చాలా మంది సమాలోచనాపరులు అర్థం చేసుకోలేక పోయే వారు. విష్ణుడే సమకాలికుల్లో ఠాకూరు పట్ల ఇంత అభిమానం ఉండి, ఇంతగా ప్రేరణ పొందిన రచయితలు ఎక్కువగా లేరు. విష్ణుడేకు సంబంధించిన అయోమయాన్ని మరింత పెంచే విషయం - పదజాలంలోనూ, ప్రపంచాన్ని చిత్రించడంలోను రవీంద్రనాథ్‌కు చాలా భిన్నంగా ఉండే సాహిత్య పరంపరతో తాదాత్మ్యం ఏర్పరచుకోవడం. అదే టి.ఎస్. ఇలియట్ నుండి ఎంతో ఉత్తేజం, ప్రేరణ పొందడం. ఇలియట్ కవితలను డే అనువదించాడు కూడా. ఇంతేకాక సాహిత్యేతర పరంపరలతో ఆయనకున్న పరిచయము, ఆసక్తి కూడా ఆయన వ్యక్తిత్వ నిర్మాణంలో, సాహిత్య రచనలో తోడ్పడ్డాయి. ఉదాహరణకు మన దేశపు కళారూపాలు, ముఖ్యంగా జామినీ రాయ్ చిత్రాలు ఆయన ఆలోచనా ధోరణిని, రచనా విధానాన్ని బాగా ప్రభావితం చేశాయి. జామినీ రాయ్ చిత్రాల వ్యాఖ్యాతగా కూడా ఈయనకు పేరుంది. విద్యార్థి దశ నుండే పాశ్చాత్య శాస్త్రీయ సంగీతంలో కూడా అభిరుచి కలగడంతో ఆ తర్వాత అందులో మంచి ప్రవేశం సంపాదించాడు.

విష్ణు డే బెంగాలీలో 15 కావ్య రచనలు, 6 గద్య రచనలు, 6 అనువాద రచనలు, 3 సంకలనాలు ప్రచురించారు. ఇవికాక ఇంగ్లీషులో 8 రచనలు వెలువరించారు. ఇవి ముఖ్యంగా చిత్రకళకు, మూర్తి కళకు సంబంధించినవి. పాశ్చాత్య సాహిత్యతత్త్వంతో ప్రభావితుడైనందువల్ల ఈయన టి.ఎస్. ఇలియట్, మలార్మే, అరగాన్, షేక్స్పియర్, లోర్కా, ఆఫ్రికన్ కవులు, మొదలగు వారి రచనలను బెంగాలీలోకి అనువదించారు. ఇంతే కాక మార్క్సువాద అభిమాని కావడంవల్లనేమో మావోత్సేతుంగ్ కవితలను కూడా ఈయన అనువదించారు.

# బతుకమ్మ పండుగ-తెలంగాణ పండుగ

- కాండ్రేగుల నాగేశ్వరరావు

జల సంబంధమైన పండుగ 'బతుకమ్మ' పండుగ ఒక్కటేనంటారు ఫొటో జర్నలిస్ట్ శ్రీ భరత్ భూషణ్. వానలు కురవగానే చెట్లు పచ్చబడి, పూలతో పరిమళించి హృదయమున్న మనుషుల హృదయాలకు జోలలు పాడుతాయి. అటువంటి కోవకే చెందిన తంగేడుపూలు. ఈ పూలతోనే బతుకమ్మ బొమ్మలను అలంకరిస్తారు. ఆ పూలు పూసే సమయంలోనే ఈ పండుగ వస్తుంది. కాని కాలం మారింది. ఋతువులు మారాయి. వర్షాలు వాటి ఇష్టం వచ్చినప్పుడు వస్తున్నాయి. అందుకని తంగేడులు పూయడం లేదు. బతుకమ్మ బొమ్మను అలంకరించడం లేదు.

అంతేకాదు విపరీతమైన జనారణ్యాలతో, గృహారణ్యాలతో నేల నింగి నిండి పోతున్నాయి. ప్రకృతికి మానవుడు దూరమయ్యాడు. అందుకని ఆధునిక గృహాలు కాగితపు పూలు, ప్లాస్టిక్ మొక్కలు పూలతో నిండిపోతున్నాయి. వీటి కోసం ఏ మధుపం ఘీంకారం చేయడం లేదు. ఏ భ్రమరము పరిభ్రమించడం లేదు. తేనె కోసం ఈగలు ముసరడం లేదు. ప్రకృతి శోభ పండడం లేదు. ఎండి పోయింది.

ఈ పరిస్థితి 'బతుకమ్మ'కు తప్పలేదు. భర్తల బతుకు బాగుండాలని, దీర్ఘాయుస్సు ఉండాలనే ఆ కాంక్షించే బతుకమ్మ ప్రతిమే బండువారింది, ఎండువారింది. ప్రకృతిలో సహజంగా లభించే తంగేడు పూలు కరవయ్యాయి. ఫలితంగా కాగితం పూలు, ప్లాస్టిక్ పూలు బతుకమ్మ ఆహార్యమవుతున్నాయి.

నాటి బతుకమ్మ పండుగలో ఉండే ప్రకృతి అభివ్యక్తీకరణ, తంగేడు పూల మృదుత్వం, మాధుర్యం, వర్ణ శోభ, ఆ మట్టి వాసనలు, తాజాతనం నేటి బతుకమ్మలో కరువయ్యాయి.

నేటి బతుకమ్మ నాటి బతుకమ్మ చాయ మాత్రమే.

అందుకే ప్రపంచ ప్రఖ్యాత ఫొటో జర్నలిస్ట్ భరత్‌భూషణ్ గత పది సంవత్సరాలుగా, యేటేట తెలంగాణాలోని వివిధ మారుమూల పల్లెలను బతుకమ్మ పండుగ రోజు దర్శించి, భావితరాలకు 'బతుకమ్మ' కమనీయ పుష్పాలంకృత ప్రతిమను అజరామరంగా అందించే ఉద్దేశంతో, తన అసమాన కెమేరా కళతో ఛాయా చిత్రాలుగా ఉంచి, తెలంగాణా పండుగ అయిన బతుకమ్మ పండుగకు అమృతత్వాన్ని ప్రసాదించారు. ఆయన ఈ పండుగను దాదాపు 30 కళాఖండాలలో బంధించారు. వాటిలోవే ఈ నెల 'మిసిమి' అట్టలను అలంకరించిన నాలుగు చిత్రాలు. -సం॥

వర్షాకాలం వచ్చినట్లే వచ్చి వెళ్ళిపోయింది. చలికాలం చెప్పా చెయ్యకుండా వచ్చి చక్కిలి గింతలు పెడుతుంది. ఆశ్వీయజ మాసం శుక్ల పాడ్యమి, ఇంటింటా పండుగ వాతావరణం, కోడళ్ళు అత్తింటిని వదలి పుట్టిల్లు చేరారు. అమ్మతో, అమ్మమ్మతో, అక్కతో, చెల్లెళ్ళతో ఆప్యాయతలు, అనురాగాలు పంచుకుంటూ, వింతలూ విశేషాలతో ముచ్చట్లాడుతుంటే, ప్రేమాను బంధాలసారమే జీవితంగా అందరి ముఖాల్లో విప్పారిన ఒక వింత ఆనందంతో మెరిసిపోతుంది తెలంగాణం.

అసలు సిసలైన, ఖచ్చితంగా మనదైన, మనదే అయిన ముతక రంగులయిన పసుపు, చిలకాకుపచ్చ, కుంకుమ ఎరుపు చీరలను సింగారించిన పడతుల కోలాహలంతో అచ్చంగా తొమ్మిది రోజులు, అక్షరాల

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ శాఖలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

నవరాత్రులు, స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ, నచ్చిన బట్ట కట్టుకొని, నచ్చిన నగలు ధరించి, బాల్య స్నేహాలను పునరుద్ధరించుకుంటూ, పుట్టింటి ఆప్యాయతతో తలమునకలవుతారా తెలుగింటి ఆడపడుచులు.

తరుణులంతా కలసి తొమ్మిదవ రోజు ప్రొద్దుటే శుచారా స్నానం చేసి కంచుతో చేయబడ్డ తాంబాళం పళ్ళెంపై తంగేడు పూలను, గొనుగు పూలను, శిఖరాకారంలో రంగు రంగు దొంతరులుగా పెట్టి, శిఖరాగ్రాన పసుపు ముద్దను గౌరీదేవిగా ఉంచి భక్తితో సింగారిస్తారు. దాని చుట్టూ వలయాకారంలో, వంగుతూ, లేస్తూ, చప్పట్లు చరుస్తూ, పాటలు పాడుతూ తమ తమ మాంగళ్యాన్ని కలకాలం నిలపమని బతుకమ్మను వేడుకొంటూ సాదరంగా ఆహ్వానిస్తుంటే, మరొక వైపు మేమేనా తక్కువ తిన్నదని బుజబుజరేకుల బుజ్జాయిలు మరో బుజ్జి బతుకమ్మను చేసుకుంటూ పాడుకుంటారు. ఆ బుజ్జి బతుకమ్మ పేరే "బుడ్డమ్మ." రాబోయే కాలంలో యవ్వన వంతులయే తాము సకల సౌభాగ్యాలతో జీవించడానికి అన్ని విధాలా యోగ్యుడైన భర్త లభించాలని ప్రకృతికి బాలకన్యలు చేసే కైమోడ్పు నివేదనలవి.

విందులు, వినోదాలు ముగిసి, చల్లబడిన ఆసాయంకాలపు వాతావరణంలో నీలాకాశపు పందిరి కింద, నీలాల జలశయంపైన, ఈ రెండు నీలాల మధ్య బతుకమ్మను తలపై పెట్టుకొని నిలువెత్తిన హరివిల్లులా బాజాభజంత్రీలతో సాగిపోతున్న తెలంగాణా ముత్తయిదువుల మందగమనం ఒక కమనీయ దృశ్యకావ్యం. సాంప్రదాయం ఒక జీవనరాగమై ఆలపించే సమయమది. నదీతీరం చేరిన తరువాత ఆ పూల బతుకమ్మను నీటిలో ముంచి దానిపై నున్న పసుపు గౌరవమ్మకు భక్తితో నమస్కరించి, తమ మాంగళ్యాన్ని కాపాడమని ఆ గౌరమ్మను తాళితో స్పృశిస్తారు. తేజస్సును శ్వాసిస్తూ, దశదిశలకూ జీవం ప్రసాదిస్తూ, పూలన్నీ మొగులై, ఉపనిషద్భోగులై, నదీమ తల్లి జలతరాంగాలలో తమను తాము కై మోడ్పు చేసుకుంటాయి. ఆ ఆనంద పారవశ్యంతో పూలబాలలు, నదులూ, చెరువులపై తేలుతూ పూల సజ్జలుగా మారే అద్భుత దృశ్యమది. సూర్యాస్తమయ సమయంలో క్రమేపీ నల్లటి నీడలు నడుంవాల్చగా ఆ మహిళాలోకం నిట్టూర్పులు విడుస్తూ ఇంటి ముఖం పడుతుంది.

ఇదంతా భావకులకు కనిపించే బాహ్యదృశ్యమయితే, ఈ సాంప్రదాయం వెనుక దీటుగా నిలచే శాస్త్రీయత కూడా వుంది. వర్షం పుష్కలంగా పడినప్పుడు మాత్రమే పుష్పించే తంగేడు, గొనుగు పూలు తలలో పెట్టుకొనే సుగంధ పుష్పాలు కావు. ఈ పూరేకులలో, ఆ పుప్పొడిలో దాగున్న సహజ రసాయనాలకు నీటిని శుభ్రపరచే గుణం వుంది. ఇవి పర్యావరణాన్ని కాపాడే రక్షక కవచాలు. అందుచేతనే ఈ బతుకమ్మను తాము తాగే నీటి వనరుల వద్ద (అది చెరువు లేదా నది కావచ్చు) మాత్రమే నిమజ్జనం చేయటం వలన ఆ నీరు శుభ్రపడుతుంది. ఈ పండుగకు రెండు నెలల ముందు వచ్చే వినాయక నిమజ్జనంతో ఆ విగ్రహాలలో వుండే మట్టి నీటి అడుగుకు చేరి తగినంతగా నీటి చలమను స్థిరపరుస్తుంది. ఈ పూలు ఆ నీటిని వడగట్టి త్రాగునీరుగా మారుస్తుంది. వర్షాభావం వచ్చినప్పుడు తంగేడుపూల, గొనుగు పూల కొరత ఉన్నప్పుడు కాగితపు పూలతో బతుకమ్మను తయారు చేస్తారు. అయితే దీనిని నిమజ్జనం చేయరు. నది వరకూ ఊరేగింపుగా వెళ్ళి ఆ కాగితపు బతుకమ్మను ఇంటికి తిరిగి తీసుకువచ్చి జాగ్రత్తగా భద్ర పరుస్తారు.

సిద్ధిపేటలో చెక్కపై పెట్టే చెక్క బతుకమ్మ, నిజామాబాద్‌లోని బాలి బతుకమ్మలుగా కొద్ది ప్రక్రియా బేధాలున్నాయి. మెదక్, నారాయణఖేడ్‌లలో మాత్రం దళితులు పిడకలకు పువ్వులు పెట్టి గోడకు పెడతారు. ఈ సంప్రదాయం మహారాష్ట్ర దళితులలో కూడా వుంది.

నీటికొరత ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా వున్న సమస్య. ఈ సమస్యపై హైదరాబాద్‌లో Global Fresh Water Meet జరిగినప్పుడు, 80 దేశాలనుండి ప్రతినిధులు హాజరైనారు. ఆ సమయంలో బతుకమ్మ పండగ విషయమై ప్రస్తావించి దానిని 26 ఛాయా చిత్రాలుగా ప్రదర్శించి అందరి మన్నలను పొందాడు ప్రఖ్యాత ఫోటో జర్నలిస్టు జి. భరత్ భూషణ్. గత పది సంవత్సరాలుగా తెలంగాణాలో వివిధ ప్రాంతాలలో జరుపుకునే ఈ పండుగను క్రమం తప్పకుండా తన కెమేరాలో బంధిస్తూ వస్తున్నాడు. భరత్ చెప్పినట్లుగా కాకతీయుల పాలనలో రాజకీయ రంగంలో, పరిపాలనా రంగాలలోనే కాదు, సైనిక పరంగా కూడా తెలంగాణా స్త్రీలు తమ చేతనూ, సత్తానూ చూపారు. కాకతీయ రుద్రమ్మ లాంటి రాణి మొదలు, జానపద స్త్రీలయిన సమ్మక్క, సారలక్క లాంటి ఎందరో మహిళలను కన్న వీర భూమి ఇది. ఈ చారిత్రక సత్యానికి నిలువెత్తు సాక్షాలుగా నిలబడతాయి. శ్రీశైల క్షేత్రంలోని ఆయుధ మూర్తులయిన స్త్రీల శిల్పాలు. "బుడ్డమ్మ"ను పోలిన అట్లతద్దిలాంటి కన్నె పిల్లల పండుగ దేశంలో చాలా చోట్ల వున్నా బతుకమ్మ లాంటి ముత్తయిదువ పండుగ మాత్రం లేదు. భూషణ్ మాటల్లో చెప్పాలంటే "ఇది కేవలం గ్రామీణ స్త్రీలు జరుపుకొనే పండుగ, ఇందులో వైదిక కర్మలాచరించే బ్రాహ్మణులు, వైశ్యాలు తప్ప మిగిలిన ప్రజాబాహుళ్యం తర, తమ భేదాలు పాటించకుండా అందిరితో కలసి చేసుకుంటారు. అయితే పండితారాధ్య చరిత్రలో కాని, సురవరం ప్రతాపరెడ్డి రచనలలో దీనిని ప్రస్తావించక పోవటం బాధాకరం. క్రీడాభిరామంలో మాత్రమే దీని ప్రస్తావన వుంది. తెలంగాణా నుండి ఎందరో చిత్రకారులు ప్రసిద్ధి పడినారు. కానీ కాపురాజయ్య, ఏలే లక్ష్మణ్, యాసాల బాలయ్యలు తప్ప మిగిలిన వాళ్ళెవరూ దీనిని చిత్రించలేదు. దాశరథి వ్రాసిన మోదుగుపూలు, జింబో వ్రాసిన కొన్ని గేయాలలో మాత్రమే బతుకమ్మ కనిపిస్తుంది. క్రమేపీ పండుగ వాతావరణం తగ్గుతుంది" అని ఆవేదన వెళ్ళ బుచ్చాడు. తెలుగువానిగా పుట్టి, బొంబాయి మహానగరం చేరి తన సినీ సంగీతంతో ఈ దేశాన్నే ఉఱ్ఱూతలూగించిన శంకర్ జైకిషన్ ద్వయంలో శంకర్ తెలుగు వాడు కావటమేకాదు, తన పురటిగడ్డ సుందరమైన భాషని శ్రీ420 లాంటి (రాజకపూర్ చిత్రం) హిందీ చిత్రంలో కూడా 'రామయ్యా వస్తావయ్యా' అనే మకుటంతో ఒక పాటను ప్రవేశపెట్టాడు. షత్రంజ్ హిందీ చిత్రంలో కూడా 'బతుకమ్మ, బతుకమ్మ ఎక్కడికెడతావే' అనే పాటను పెట్టాడు. 'జీవిత చక్రం'లోని ఒక పాటలో బతుకమ్మ ప్రస్థావన వుంది. అందుకు నాకు చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

బతుకమ్మకు సంబంధించి, చారిత్రక సత్యాలతో కూడిన సరైన స్థల పురాణా మేమీలేదు. అత్త, ఆడబడుచుల ఆరళ్ళకు బలైపోయిన పేరంటాలమె. ఈ మూలకథలకు చిలువలు, పలువలు కల్పిస్తూ ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క కథ ప్రచారంలో ఉంది. దీనిపై బిరుదురాజు రామరాజు విస్తృత పరిశోధన చేశారు.

ఈనాడు వచ్చిన గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఎన్నో పండుగలు, వచ్చాయి. మబ్బుచాటు మార్తాండ కిరణమై పోయాయి (ఈ ప్రక్రియ తాత్కాలికమని, మబ్బులు విడచి సూర్యుడు తిరిగి ప్రకాశిస్తాడనే నమ్మకం నాలానే చాలా మందికి వుంది). ఈ ప్రభావం పడకుండా బతుకమ్మ చాలావరకూ తప్పించుకుంది. గొప్ప సంస్కృతీ విలాసాన్ని కాలం ధ్వంసం చేయలేదనే దానికి నిలువెత్తు దర్పణం బతుకమ్మ. అది తెలంగాణా ప్రజల శ్వాస, వారి ఊపిరి. ఎన్ని ఒడుదుడుకులున్నా బతుకమ్మ ఒక కాకతీయ వీరనారిలా, మహిళా ఉప్పుగల్లులా, ఒక మొనగత్తెలా కాల ప్రవాహాన్ని ఛేదించి నిలబడింది. బతుకమ్మ తెలంగాణా సామాజిక జీవనంలో ఒక విడదీయరాని బంధంగా, చిరకాలం చిరంజీవిలా నిలుస్తుందని ఆశిద్దాం.

# మనిషి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న విద్యుత్ పరికరాలు

- సి.వి.సర్వేశ్వర శర్మ

ఆధునిక శాస్త్రవిజ్ఞానం మనకు ఎనిలేని సౌకర్యాలు సమకూరుస్తోంది. ఇరుగు-పొరుగు వారితో సంబంధాలు గురించి ఆలోచించకుండా బయట ప్రపంచాన్ని ఇంట్లోకి తీసుకు వచ్చి చూపెడుతున్న టీవికి చాలా కుటుంబాలు అంకితమై పోయాయి.

ప్రపంచాన్నే గ్లోబల్ విలేజ్‌గా కంప్యూటర్లు మార్చేశాయి. సెల్‌ఫోన్లు మనిషి ఎక్కడవున్నా అంటిపెట్టుకుని ఉండి సేవలు అందించేస్తున్నాయి. మైక్రోవేవ్ ఓవెన్‌లు వంటి ఇంటి రూపాన్ని పాశ్చాత్య దేశాల్లో అయితే బాగా మార్చి వేశాయి.

ఎక్కడ సౌకర్యాలు ఉంటాయో అక్కడ ఇబ్బందులు కూడా ఉంటాయి. ఈ అధునాతన పరికరాలు మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీయడంలో కూడా ప్రథమ వరుసలో వున్నాయని పలువురు పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

ఈ పరికరాలను తగిన జాగ్రత్తతో వినియోగిస్తే అవి చేసే హాని నుండి కాపాడుకోవచ్చు. కంప్యూటర్‌తో ఇంటర్ నెట్, ఇ-మెయిల్‌కు అలవాటుపడి సామాన్య ప్రజానీకం కంప్యూటర్‌కు బాగా చేరువయ్యారు. మౌస్‌తో క్లిక్ మనిపిస్తే కంప్యూటర్ తెరపై మొత్తం ప్రపంచం సాక్షాత్కరింప జేస్తుంది ఇంటర్ నెట్.

కంప్యూటర్ ప్రయోజనాలు అపరిమితం. అయినా దీనిని ఎక్కువ కాలం వినియోగించే వారికి ఇది హాని కల్గిస్తుందని హెచ్చరికలు వస్తున్నాయి. ధూమ పానం, మద్యపానం వంటి వాటికి మనిషి ఏ విధంగా బానిస అయిపోతున్నాడో కంప్యూటర్‌కు అలవాటు పడినవారు అదొక వ్యసనంగా దానికి అతుక్కుపోయి ఉంటున్నారు.

కంప్యూటర్లు, టీవిలు మానవ సంబంధాలకు దూరంగా మానుష్యులను తీసుకుపోతున్నాయి. కంప్యూటర్లు వాడేవారు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దాని వల్ల కలిగే దుష్ఫలితాల బారినుండి బయట పడవచ్చు.

- మనిషి తలకు - కంప్యూటర్ తెరకు తగినంత దూరం ఉండాలి.
- కంప్యూటర్‌తో పనిలేనప్పుడు దానిని ఆఫ్ చేయాలి, ఆన్‌చేసి ఉంచకూడదు.
- కంప్యూటర్ తెర కాంతి తీవ్రత తగ్గించడం వల్ల కంప్యూటర్ విడుదలచేసే 'వికిరణాల' వల్ల హాని తగ్గుతుందని కొంతమంది అభిప్రాయం. ఇది నిజం కాదు.
- 'కాంతి తీవ్రత' తగ్గించినప్పటికి 'వికిరణాల' విడుదలలో పెద్దగా మార్పు ఉండదు.
- 'వికిరణాల' ఉత్పత్తి తక్కువగా ఉండే 'మోనోక్రోమ్' మానిటర్లు వాడడం మంచిది.
- కంప్యూటర్ వాడకం దార్లు ఎప్పుడూ ఒకే భంగిమలో కూర్చుని పని చేయడానికి అలవాటు పడి ఉంటారు కాబట్టి 'నడుం నొప్పి' వచ్చే అవకాశాలు హెచ్చుగా ఉంటాయి.

---

సి.వి. సరేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్, అమలాపురం.

- ఇటువంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా చేసేందుకు కుర్చీలో నిటారుగా కూర్చుని చేతుల్ని ముందుకు చాపి 'కీ' బోర్డు కొద్దిగా టచ్ అయ్యేలా చూసుకోవాలి.
- కంప్యూటర్ ముందు కుర్చీలో కూర్చున్న వారి పాదాలు నేలకు తాకుతూ ఉండాలి.
- తలకు ఎదురుగా మానిటర్ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి.
- అవిశ్రాంతిగా కంప్యూటర్ ముందుకూర్చుని పనిచేయకూడదు.
- ప్రతి అరగంటకు ఒకసారి కంప్యూటర్ ముందునుండి లేని పచార్లు చేసి శరీరాన్ని బాగా స్ట్రెచ్ చేసుకుని మళ్లీ కంప్యూటర్ దగ్గర కూర్చోవాలి.

## విద్యుత్ దీపాల ఎక్కువ కాంతి .....

ఆఫీసుల్లో లేదా ఇళ్లలో ఎక్కువ 'వాటేజ్' గల విద్యుత్ దీపాలు వెలిగించుకోవడం వల్ల ఎక్కువ కాంతివంతంగా దేదీప్యమానంగా ఉండవచ్చుకాని ఈ విద్యుత్ దీపాలు వెలువరిచే కిరణాల వల్ల వాటికింద మసలే వారి ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుందంటున్నారు.

ఈ కిరణాల ప్రభావం వల్ల చర్మ క్యాన్సర్ రావడమే కాదు అకాల వృద్ధాప్యం కూడా వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి చికాకులకు కారణం ఆ విద్యుద్దీపాలు వెలువరించే కాంతికిరణాలతో బాటు అతి నీలలోహిత కిరణాలు కూడా ఉండడమే అంటున్నారు.

## సెల్ ఫోన్లు

వాహనాలు డ్రైవ్ చేసుకుంటూ సెల్‌ఫోన్లు మాట్లాడుతూ ఉండడం వల్ల అమెరికాలో రోడ్డు ప్రమాదాలు ముప్ఫయి అయిదు శాతం పెరిగినట్లు అక్కడ అధికారికంగా ప్రకటించారు.

విమానాల్లో సెల్ ఫోన్స్ వినియోగించడం వల్ల విమానంలో యంత్రాలకు అందాల్సిన సంకేతాలు సరిగా అందడం లేదని సాంకేతిక నిపుణులు చెపుతున్నారు. ఈ కారణంగానే విమానాల్లో ప్రయాణించేటప్పుడు సెల్‌ఫోన్లు వాడవద్దని హెచ్చరిస్తున్నారు.

సెల్‌ఫోన్ చెవిదగ్గర పెట్టుకుని అదేపనిగా మాట్లాడడం వల్ల వాటినుండి వెలువడే వికిరణాల వల్ల మాట్లాడే వ్యక్తి ఏకాగ్రత్త దెబ్బతినడం, తాత్కాలికంగా జ్ఞాపక శక్తిలో లోపాలు ఏర్పడడం జరుగుతుంది.

పిల్లలు ఎక్కువ సేపు సెల్‌ఫోన్లు వాడితే, దాని ప్రభావానికి వారికి హానికల్గుతుంది. పిల్లలు సెల్‌ఫోన్లను తమ శరీర అవయవాలకు దూరంగా ఉంచుకోవాలి. వాటిని ఒళ్లో పెట్టుకోకూడదు. సెల్‌ఫోన్లు విడుదల చేసే వికిరణాలు పిల్లల మస్తిష్కం మీద, నాడీ మండలం మీద తమ ప్రతాపాన్ని చూపుతాయి.

నిరంతరం సెల్ ఫోన్లు వాడడం వల్ల మస్తిష్క కాన్సర్, లుకేమియా, క్లోమగ్రంధుల కాన్సరు వచ్చే ప్రమాదం ఉందని ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి. అయితే సెల్ ఫోన్లు విడుదల చేసే వికిరణాల వల్ల కాన్సర్ వస్తుందని ఆధారాలు లభించడం లేదని శాస్త్రవేత్తలు ప్రకటిస్తున్నారు.

## ప్రయోజనాలు :

సెల్‌ఫోన్ యాంటినా నుండి విడుదలయ్యే సూక్ష్మతరంగాలు మనిషి శరీరంలో ప్రవేశించి గుండె,

ఊపిరితిత్తులను ఢీకొని వెనుదిరిగి వస్తాయి. గుండె, ఊపిరితిత్తులు కదులుతూ ఉండడం వల్ల వాటి మీద పడిన కిరణాలకు, వెనుదిరిగిన వికిరణాలకు తరచుదనంలో కొంచెం తేడా ఉంటుంది.

ఇలా పతన, పరావర్తన వికిరణాల మధ్య తరచుదనంలో ఏర్పడే తేడాను 'డాప్లార్ షిప్టు' అంటారు. ఈ సూత్రం ఆధారంగా గుండె, ఊపిరి తిత్తుల పనితీరును రికార్డు చేసే యంత్రాన్ని తయారు చేసి సెల్‌ఫోన్లో అమర్చాలని శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటికే ఈ ప్రయత్నాలు కొంత ఫలించాయి. సెల్‌ఫోన్‌గల వ్యక్తిని బంధించినా, లేదా అపస్మారక స్థితికి వెళ్లినా ఇతరులకు సెల్‌ఫోను ద్వారా అతని నెంబరుకు డయల్ చేయడం ద్వారా తెలుస్తుంది.

ఇక్కడ ఒక విశేషం ఉంది. సెల్‌ఫోను వాడకంపై ఆరోగ్యపరంగా ఒకవైపు వాదోపవాదాలు జరుగుతూ ఉంటే, సెల్ ఫోన్‌తో ఇతరుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవచ్చును అంటూ పరిశోధనలు జరగడం కొస మెరుపు.

మొబైల్ ఫోన్ల నుంచి విద్యుత్ అయస్కాంత క్షేత్రాలు విడుదలవుతాయి. వీటివల్ల డి.యన్.ఎ. దెబ్బతినడం, ఆస్మా, ఆల్జీమర్స్‌వంటి వ్యాధులు రావడం జరుగుతాయని పరిశోధకులు అంటున్నారు.

**జాగ్రత్తలు**

- వీలైనంత తక్కువగా మొబైల్ వాడడం మంచిది. రేడియేషన్ మీద పడకుండా ఒక షీల్డు వంటి దానిని ఉపయోగించాలి.
- విద్యుత్ ఉపకరణాలకు వీలైనంత దూరంగా ఉండాలి.
- ఇంట్లో విద్యుత్ మీటర్ల నుండి కూడా విద్యుత్ అయస్కాంతక్షేత్రాలు వెలువడుతాయి. అందుకే మీటర్లు దూరంగా మనుషులు మసలని ప్రాంతంలో బిగించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- టీవికి దగ్గరగా పిల్లలు కూర్చోకూడదు, దూరంగా కూర్చోవాలి. ఈ విషయంలో పిల్లల్ని కట్టడి చేయాలి.
- ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ల సమీపంలో నివశించకూడదు. ఇల్లు ఆ ప్రాంతంలో ఉంటే ఇంట్లో విద్యుత్ అయస్కాంత క్షేత్రాలు ఏమైనా ఉన్నాయేమో చెక్ చేసుకుంటూ ఉండాలి.

## సవరణ

**సెప్టెంబరు సంచికలో "సైన్సు బోధనను ఎలా ఆసక్తికరం చేయాలి: చర్చ"** వ్యాస రచయిత నాగసూరి వేణుగోపాల్ అని పొరపాటున ప్రచురితమైనది. ఆ వ్యాసం రాసింది ఐ.కె. రావు. వీరు చాలాకాలం కళాశాల స్థాయిలో గణితం బోధించడమేకాక, తెలుగు అకాడమీ కొరకు 1978 ప్రాంతంనుంచే పాఠ్యపుస్తకాలు, యితర పుస్తకాలు రాశారు. ఐ.కె. రావు పదవీవిరమణ చేశాక అనంతపురంలో స్థిరపడ్డారు.

# భవభూతి కరీంనగర్ ప్రాంతీయుడా?

- డా॥ సంగనభట్ల నరసయ్య

'ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే' అన్న ప్రసిద్ధిగాంచి, సంస్కృత నాటక సాహిత్య వినీలాకాశంలో కనిష్ఠికాధిష్ఠితుడైన కాళిదాసు పక్కన, భవభూతి మహాకవి అనామికాధిష్ఠితుడైనాడు. మహావీరచరిత్ర, మాలతీమాధవం, ఉత్తరరామచరిత్రం అనే మూడు నాటకాలు రాసినా, కరుణరసోపప్లవంగా ఉత్తరరామచరిత్రం రాసి జగద్గీతకీర్తికాయుడైనాడు. భవభూతి పరమ నిష్ఠాగరిష్టులు, సోమపీథులు, దృఢవ్రతులు, వేదాధ్యేతలు, పంక్తిపునీతులు, కృష్ణ యజుర్వేద తైత్తిరీయ శాఖీయులు, కాశ్యపగోత్రికులు ఐన బ్రాహ్మణ కుటుంబంలో నుండి వచ్చానని చెప్పుకున్నాడు.

భవభూతికి శ్రీకంఠుడని మరో పేరుంది. "శ్రీకంఠపదలాంఛనః భవభూతిర్నామ" అని నాటకంలో చెప్పుకొన్నాడు. ఈతని తండ్రి పేరు నీలకంఠుడు, లాంఛన అన్నది బిరుదని, అసలు పేరు అని భిన్నాభిప్రాయాలున్నాయి. భవభూతి అనేది కూడా బిరుదు కాక అసలు పేరే కావచ్చు. ఈతని పూర్వీకుల్లో 'సింహభూతి' అనే పేరుగలవాడున్నాడు.

కన్యాకుబ్జాన్నేలిన యశోవర్మ ఆస్థానంలో ఉండటం చేత భవభూతి కాలం క్రీ॥శ॥ 680-750 ప్రాంతం అని చెప్పుతారు.

దక్షిణాపథంలో విదర్భదేశంలో పద్మపురంలో తాను నివసిస్తున్నట్టు పేర్కొన్న భవభూతి రాజాశ్రయం కోసం వలసవెళ్ళిన బ్రాహ్మణ పండితుడు. నాగపూర్ నుండి తెలంగాణ గోదావరి హద్దు వరకు దక్షిణంగా విస్తరించిన ప్రాంతం విదర్భ రాజ్యం, అంటే తెలంగాణకు పొరుగురాజ్యం. ఈ పద్మపురం వాకాటరాజుల కాలంలో మహోన్నత స్థితిలో ఉండేది. తెలంగాణ బ్రాహ్మణులనేకులు అక్కడికి వలస పోవడానికి కారణం వాకాటరాజులు బ్రాహ్మణ మతస్థులు, వైదికమతావలంబులు. పద్మపురంలో నివసించినా, భవభూతి గ్రామం యమునానది తీరంలోని 'కాల్పి' కావచ్చునని ప్రముఖ చరిత్ర పరిశోధకులు శ్రీ విష్ణు మిరాశి, ఆచార్య ఆల్టేకర్ పండితుడు మొదలగువారూహించారు. దీనికొక కారణం ఉంది. భవభూతి తన మూడు నాటకాలను తన మాతృభూమి మీద ప్రేమతో కాళప్రియనాథుని (శివుని) సన్నిధానంలో జాతరలో తొలుత ఆడించబోతున్నానని నాటకాల్లో రాసుకొన్నాడు. కాళప్రియనాథుని సన్నిధియే 'కాల్పి' పట్టణమని

> శా॥ యన్మాద్యద్ద్విపదన్త ఘాత విషమం కాళప్రియ ప్రాఙ్గణం
> తీర్ణాయత్తుర్గై రగాథయమునా సిన్ధు ప్రతిస్పర్ధినీ............

అనే శ్లోకం ద్వారా ఊహించారు. ఈతని గ్రామం భవిష్య, వరాహ పురాణాల్లో ప్రసక్తమైన యమునా నది తీరంలోని 'కాల్పి' అని వీరిభావన. మూడు నాటకాలు తొలుత ఆడించిన ఈ కాళప్రియనాథుని ఇష్టదైవంగా, మాతృభూమి మీది మమకారం కారణాలుగా, ఆ పరిసరాలే ఆయన జన్మభూమిగా చాలామంది అంగీకరించారు.

## భవభూతి తెలుగువాడా?

సుదూర ప్రాంతమైన ఉత్తర భారతంలోని యమునానదికి, తత్తీర 'కాల్పి' నగరానికి భవభూతికి కేవలం 'కాళప్రియనాథుని' దేవాలయం కారణంగా సంబంధాన్ని ఊహించినా, నిజానికి భవభూతి

డా॥ సంగనభట్ల నరసయ్య, ప్రిన్సిపాల్, శ్రీ లక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల, ధర్మపురి.

తాను నివసించిన విదర్భకు పొరుగునగల తెలుగు ప్రాంతీయుడు. ఈయన తెలుగువాడే అని నిరూపించగలిగే ఆధారాల్లో మొదటిది భవభూతికి గోదావరి నది అన్నా, తత్పరిసరాలన్నా ఎనలేని ప్రీతి. ఉత్తరరామచరిత నాటకం గోదావరి తీరంలోనే నడిపాడు (వాల్మీకి మహర్షి పూర్వ రామాయణం గోదావరి నదీ పరిసరాలు). తత్తీరాన్ని వర్ణించవలసి వస్తే భవభూతిలో ఆనందం ఉరకలేస్తుంది. తన ప్రవాస భూమి జన్మభూమిల మధ్య రేఖా గోదావరి నది. (విదర్భ, తెలంగాణాల మధ్య గోదావరి నది సరిహద్దు) తన రెండు నాటకాలలో (మహావీర చరిత్ర, ఉత్తర రామాయణాల్లో) గోదావరిని వర్ణించాడు.

గోదావరిని ప్రేమగా 'సరసనీర' అని వర్ణించాడు. గోదావరి నీరు తాగిన అభిమానమది. మాలతీ మాధవంలో 'స్మారయన్తి దక్షిణారణ్య భూధరాన్' అని తాను తిరుగాడిన దక్షిణదేశ వనాలను స్మరించికొన్నట్టు పాత్ర ద్వారా స్మరింపజేసాడు.

(i) "తదియం గోదావరీ హ్రదాన్నిష్క్రమ్య" / గోదావరిలోని నీళ్ల గుండంలోంచి లేచివచ్చి), (ii) సీతా తీర్థేన గోదావరీ మవతీర్య (సీతాతీర్థమనే పేరుగల రేవులో గోదావరి నదిని దాటి), (iii) త ఏవ వివిధ విస్రమ్భ సాక్షిణో గోదావరీ కాననోద్దేశా." (గోదావరి నది అరణ్యాలు వివిధ జ్ఞాపకాల సాక్ష్యాలు), (iv) మేఘమాలేవ...గిరిః ప్రసవణః సోఽయం యత్ర గోదావరీ నదీ (ప్రసవణమనే పేరుగలకొండ, పక్కన గోదావరి నది, అదిగో!) వంటి ఉత్తర రామ చరితంలోని ఉక్తులు సజీవ సాక్ష్యాలు.

*రెండోకారణం అతని ఉత్తర రామచరిత నాటకంలోని తెలుగు సంభాషణలు:*

i) 'హంత! మాతర్జీవామి' (ఉ.రా.చ. ద్వితీయాంకం) అని రాసిన సంభాషణా శకలం. 'అమ్మ! బతికిపోయాను' అని సంస్కృతంలో అనరు. అంటే ఆ నుడికారం సంస్కృత వాక్య నిర్మాణ శైలికి కుదరదు. ఇది తెలుగువాడే అనాలి. మరొకడు అనడు. ఉత్తర రామచరిత వ్యాఖ్యాత ఘనశ్యాముడు ఈ చోట "ఏవం వదతా కవినా నిజ ద్రావిడత్వం ప్రకటితాం" అని వ్యాఖ్యానించాడు. తెలుగు నేల నుండి వెళ్ళిన తెలుగు వారు ఉత్తర భారతానికి వెళ్తే, వారు ద్రావిడ దేశం నుండి వచ్చారని చెప్పే ఆచారముంది. పూర్వ ద్రావిడ దేశంగా, ద్రావిడజన్య తెలుగు ప్రాంతంగా, ఉత్తర భారతదేశానికి దగ్గర ప్రాంతంగా దీనికే పేరుంది.

ii) "వత్సయోః పితుః" (ఉ.రా.చ. తృతీయాంకం) అని రాసిన మరో సంభాషణా శకలం అచ్చమైన తెలుగు మాటకు సంస్కృతీకరణం, 'పిల్లల తండ్రి' అనే తెలుగు మాట. తెలంగాణ భాషలో చెప్పాలంటే ఈ పిల్లగాళ్ల (లవకుశుల) తండ్రి (రాముడు అని!). సంస్కృతంలో ఇలాంటి వాక్య నిర్మాణం కాని ఇలా చెప్పడం కాని ఉండదు. ఇది అచ్చమైన తెలుగు నుడికారమే. దీన్ని కూడా ఉ.రా.చ. వ్యాఖ్యాత ఘనశ్యాముడు "వత్సయోః కుశలవయోః పితుః నిజభర్తుః రామభద్రస్యే త్యర్థః ఏతేన కవినా నిజ ద్రావిడత్వం ప్రకటితమిత్యూహ్యం" అని వ్యాఖ్యానించాడు.

మూడో కారణం ఇంటిపేరు. "ఉదుంబర నామనో బ్రహ్మవాదినః" అని భవభూతిచే ఇంటిపేరు చెప్పబడ్డది. ఇది ఆయన ఇంటి పేరుగా సర్వులు నిర్ధారించారు (ఉదుంబర - నామ - నః = అంటే ఉదుంబరులని పేరు గల మేము = మా కుటుంబం అని దీని అర్థం). విదర్భీయులకు అంటే మహారాష్ట్రులకు ఇంటి పేర్లుండవు. గ్రామ నామాలుంటాయి. తెలుగు వారికి ఇంటి పేర్లుండటం అతి ప్రాచీనమైన విధానం.

అంతేకాదు కాశ్యపగోత్రీకులై కృష్ణయజుర్వేద తైత్తిరీయశాఖ అయిన వారు ఆంధ్రులే కాని ఇతరులు కారు. ఇతరులలో ఈ శాఖ లేదు. అందువల్ల భవభూతి తెలుగువాడే. వేదం వేంకటరాయశాస్త్రి గారీతనని ఆంధ్రుడనీ వెలనాటియో, తెలగాణ్యుడోనని భావించారు.

## భవభూతి కరీంనగర్ ప్రాంతీయుడా?

భవభూతి తన నాటకాల్లో నాందీ ప్రస్తావనల్లో తనకిష్ట దైవం అయిన కాళప్రియనాథుణ్ణి, అతని సన్నిధిలో జాతరలో నాటక ప్రదర్శన చేస్తున్నట్టు చెప్పినాడు.

"నాంద్యంతే సూత్రధారః :- అలమతి విస్తరేణ, అద్య ఖలు భగవతః కాళప్రియనాథస్య యాత్రాయాం ఆర్యమిశ్రాన్ విజ్ఞాపయామి" (ఉ.రా.చ. నాంది)

ఈ కాళప్రియనాథుని దేవాలయం ఎక్కడుంది? కాళ ప్రియనాథుడు ఉజ్జయినిలోని మహాకాలుడు అని చాలా మంది విమర్శకులు భావించారు. కాళిదాస భవభూతుల కవితాస్పర్ధలు, మాత్సర్యాల మీద కథలు ఉండటం వల్ల వీరిద్దరూ సమకాలికులూ, ఏకరాజాస్థాన కవులనీ భావించారు. కాని చారిత్రకులు వీటిని అంగీకరించరు. కాలనాథ, కాలపూజిత అనే పేర్లున్న ఉజ్జయిని మహాకాలునికి కాలప్రియనాథుడనే పేరు లేదు. యమున ఒడ్డున గల కాల్పితో భవభూతి నివాసానికి సంబంధము లేదు. అతని నివాస, ప్రవాస జన్మ భూములు, యమునతో, పరిసర ప్రాంతాలతో సంబంధం ఉన్నవి కావు.

మరి కాలప్రియనాథుడెక్కడ ఉన్నాడు? ఇది కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం. అనాదిగా ప్రసిద్ధమైన శైవక్షేత్రం. ఇక్కడే ఉత్తర రామచరితాది నాటకాలు ఆడబడ్డాయి. ఈ విషయంలో కాళేశ్వరానికి కాళప్రియనాథుడన్న పేరు ఉన్నదని ఓ చారిత్రకాధారం ఉంది. వేములవాడను పరిపాలించిన చాళుక్య ప్రభువులలో (పంపని ఆస్థాన కవిగా ఏలినవాడైన, ఇమ్మడి అరికేసరి మహారాజు తండ్రి ఐన నరసింహుడు (క్రీ॥శ॥ 915-930) తన మీదకు దండు వచ్చిన ఘూర్జర సైన్యాన్ని ఓడించి 'కాళ ప్రియ'లో స్తంభముపై తన విజయగాథ చెక్కించుకొన్నట్లు శాసనం ఉంది. వేములవాడ భీమేశ్వరాలయంలో వేయించిన శాసనములోని 8వ శ్లోకం ఇలా ఉంది.

శ్లో॥ ప్రత్యుద్గతాం ఘూర్జర రాజసేనాం, నిర్జిత్య రాజ్ఞా స్వయమేక ఏవ।
కాళప్రియే రాజకదంబకస్య, స్తంభేస్వశౌర్యం విలిలేఖశైలే ॥

ఈ శాసన శ్లోకాన్ని డా॥ నేలటూరి వేంకటరమణయ్యగారు వెలికి తీసారు. (ఘూర్జర రాజసైన్యాన్ని, సహకరించిన రాజసమూహాన్ని, తన రాజ్యం మీదకు దండెత్తిరాగా, స్వయంగా ఓడించి, 'కాళప్రియ'లో తన శౌర్యాన్ని స్తంభశిలపై లిఖించాడు.) ఈ శాసనంలో పేర్కోబడ్డ 'కాళప్రియ' కాళేశ్వరమే. కాళప్రియే = 'కాళప్రియ యందు'. కాళప్రియ దైవ నామమా? గ్రామ నామమా? గ్రామ నామమే అని చెప్పవచ్చు. శ్లోకంలో స్థలవాచిగానే ఉంది. దైవవాచిగా, స్థలవాచిగా కాళేశ్వరానికి పేరు ఉన్న సంగతి అందరికీ తెల్సిందే. (వేములవాడ రాజేశ్వరుడంటే వేములవాడ స్థలవాచి, రాజేశ్వరుడు దైవనామం) కాళేశ్వరం అంటే మాత్రం కాళేశ్వరం అనే స్థల నామం అనీ, కాళేశ్వరుడు దైవం పేరు అనీ ఉభయంగా దీనికి పేరుంది. ఇంతకు ముంద చారిత్రకులు పేర్కొన్న కాల్పి, ఉజ్జయినిలకు ఉభయంగా వర్తించే నామం లేదు. పైగా తన రాజ్యం మీదకు దండెత్తి వచ్చిన ఘూర్జర రాజసేనను వేములవాడ చాళుక్య ప్రభువు ఇమ్మడి నరసింహుడు తన రాజ్య సరిహద్దుల్లో ఓడించాలి కాని యమునానది ఒడ్డున కాదు. ఇమ్మడి నరసింహుని (నరసింహ II అంటే ఇమ్మడి అనగా రెండవ నరసింహుడు) రాజ్యం యమునానది

వరకుందని చెప్పడం అసంగతం. దండెత్తి వచ్చింది ఘూర్జరరాజు, ఓడించింది వేములవాడ రాజు కనుక యుద్ధం ఈయన రాజ్య సరిహద్దులోనే జరిగిన సంఘటనగా భావించాలి. వేములవాడ రెండవ నరసింహుని రాజ్య హద్దుల్లోనే కాళేశ్వరం ఉంది. కాళేశ్వరం, వేములవాడ గ్రామాలు కరీంనగర్ జిల్లాలోని 1వ శతాబ్ది, 9వ శతాబ్ది శివక్షేత్రాలుగా యావద్దేశ విఖ్యాతాలు. కాళేశ్వరం గోదావరి తీరాన తెలంగాణాలో కరీంనగర్ జిల్లాలో, బస్తరు జిల్లా సరిహద్దుగా, ఉత్తర దక్షిణ భారతాలకు మధ్యలో ఉంది. ఇంకా నొక్కి చెప్పాలంటే భవభూతి జన్మభూమి ఐన తెలంగాణకు, ప్రవాస భూమియైన విదర్భకు సరిహద్దురేఖ ఐన గోదావరి నది ఒడ్డున గల గ్రామం (క్షేత్రం).

మాలతీ మాధవంలో భవభూతి పేర్కొన్న 'పద్మావతి' నగరం పద్మపురమేనని కొందరు, గ్వాలియర్ ప్రాంతంలోని 'పదమపావాయ' గ్రామమని వేరే కొందరు చెప్పారు. కాని కొన్ని ప్రతుల్లో స్పష్టంగా పద్మపురం విదర్భ దేశంలోనే ఉందని ఉంది. కనుక విదర్భ దేశపు హద్దులో ఉన్న కాళేశ్వరస్వామియే భవభూతి కులదైవం అని భావించడంలో ఏ మాత్రం దోషం లేదు. పైగా తెలుగువానిగా సర్వులచేత గుర్తింపబడిన భవభూతి తన (తెలుగు) ప్రాంతంలోని కాళేశ్వరస్వామి సన్నిధిలో నాటకాలు ఆడించాడనడం సమంజసం. తెలుగునాట కాళేశ్వరం తప్ప మరొక శివక్షేత్రం ఈనామంతో ప్రసిద్ధం క్రీ.శ 7వ శ.నాటికీ లేదు, ఈనాటికీ లేదు.

కనుక భవభూతి తెలుగువాడని, తెలంగాణ వాడనీ, కరీంనగర్ ప్రాంతీయుడనీ, కాళేశ్వరస్వామి భక్తుడనీ, కాళేశ్వరంలో తన మూడు నాటకాలు జాతరలో ఆడించాడనీ, గోదావరిని తనివి తీరా తన నాటకం ఐన ఉత్తర రామచరిత్రలో అభిమానంగా వర్ణించాడనీ, వాకాట రాజుల ప్రాపు వల్ల పొరుగున గల విదర్భదేశానికి వలసవెళ్లి పద్మపురంలో నివసిస్తూ నాటకలు రాస్తూ వాటిని ప్రథమ ప్రదర్శనగా ఆడించడానికి నేటి కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరానికి తరచూ వస్తుండేవాడని నిర్ధారించవచ్చు.

భవభూతి, తన వంశ పూర్వీకుడైన సింహభూతి అనే పేర్లవల్ల వీరు ధర్మపురికి చెందిన వారేమోననిపిస్తుంది. శివకేశవ క్షేత్రమై అక్కడి రామలింగేశ్వర, నరసింహ దేవుళ్ళ క్రీ.శ. 9వ శ.నాటికే రాజన్యులచేత చేయబడిన దేవాలయ నిర్మాణాలు, దాన శాసనాలు సాక్ష్యాలుగా గల్గి కరీంనగర్ జిల్లాలోని 2000 ఏళ్ళ క్రిందటి ధర్మపురి గ్రామానికి ఈ కుటుంబం చెందవచ్చునని ఒక భావన. విష్ణుకుండిన మాధవవర్మ (క్రీ.శ. 420-470) భవదత్తవర్మ వాకాట రాజ్యంపై దండెత్తగా వాకాట ద్వితీయ ప్రవరసేనుని కుమారుడైన నరేంద్రసేనుని కాపాడుటకై, సైన్యసమేతంగా వచ్చి గెలిచి, వాకాట రాజకుమార్తె మహాదేవిని పెండ్లాడి విదర్భరాజ్య భాగాన్ని పొందినాడు. అతని మనువడు రెండవ విక్రమేంద్రుని ఇంద్రపాలనగర (తుమ్మలగూడెం) తామ్రపట్టికలో "ఏకాదశాశ్వమేధ బహుసువర్ణ పౌండరీక వాజపేయ క్రతు సహస్ర సర్వమేధ రాజసూయ పురుష మేధాద్యహరహ సమ్యగనుష్ఠిత శ్రుతి విహితాశేష దుష్కర కామ్య కర్మానుష్ఠానస్య" అని పేర్కొనబడ్డాడు. విజయుడైనచోట అనేక యజ్ఞయాగాలు చేయించిన ఈతడు దక్షిణ విదర్భ పొలిమేరల్లోని సుప్రసిద్ధ బ్రాహ్మణాగ్రహారం అయిన ధర్మపురిలో కూడా అశ్వమేధాది యజ్ఞయాగాలు చేయించి ఉంటాడు. ధర్మపురి క్షేత్ర మాహాత్మ్యం అనే 9వ శతాబ్ది స్థల పురాణ (సంస్కృత) గ్రంథంలో విదర్భ రాజు ధర్మపురితో సంబంధాలు కల్గినట్టు వర్ణించబడింది. అప్పటికి ముందే ధర్మపురి బ్రాహ్మణులు గోదావరి దాటి విదర్భకు వలసవెళ్ళే విధానం (క్రీ.శ. 5వ శ.నాటికే) స్థిరపడటం చేత భవభూతి కుటుంబం కూడా వెళ్ళి ఉండవచ్చునని భావించవచ్చు. బ్రహ్మగుండం, యమగుండం నామాలతో గల గోదావరి హ్రదాలు ఈ తీరంలో ఉన్నాయి. సీతా తీర్థమనే రేవు (ఉ.రా.చ.) వంటి సత్యవతీ తీర్థమనే రేవు ఇక్కడ ఇప్పటికీ ఉన్నాయి.

# మార్క్విజ్ డి శేడ్ - శేడిజం

- బి.వి. రామిరెడ్డి

(గత సంచిక తరువాయి)

## శేడ్‌వారసత్వం

ఫ్రెంచి సింబలిస్టు కవిత్వానికి ఆద్యుడైన ఛార్లెస్ బోదిలేర్ (1821-67) "ఫ్లవర్స్ ఆఫ్ ఈవిల్" అనేక కవితా సంకలనాన్ని వెలువరించాడు. ఇతణ్ణి అశ్లీల కవిత్వం వ్రాశాడంటూ నెపోలియన్-III నిర్బంధింపజేశాడు. ఇతడు శేడ్‌లాగే 'పాపం అనేది మానవ స్వభావపు సహజస్థితి' అన్నాడు. ప్రేమలో ఆపరేషన్ జరుగుతున్నప్పుడు కలిగేలాంటి భయంకరమైన బాధ ఉంటుంది. బోరుకొట్టడం పాపం కోసమే పాపం చేయడానికి ప్రేరేపిస్తుందన్నాడు. సహజ మానవుణ్ణి, పాపాన్ని విశదీకరించవలసి వచ్చినపుడు ప్రతి వొక్కడూ శేడ్ దగ్గరికి రాక తప్పదు అన్నాడు.

19వ శతాబ్దపు ఫ్రెంచి రొమాంటిసిజం, నేచురలిజం వెనుక శేడ్ ప్రభావం వుంది. విక్టర్ హ్యూగో (1802-85), అలెగ్జాండర్ డ్యుమాస్ (1802-70), వీళ్ళిద్దరినీ శేడ్ అనుయాయులన్నారు. వీరి రచనల్లో అక్కడక్కడా వ్యభిచార సంఘటనల వర్ణనలుండడం అందుకు కారణం. యుజీ డిలా క్రోయిక్స్ (1798-1863) పెయింటర్. ఇతని నగ్న స్త్రీ చిత్రాలలో శేడియన్ పద్ధతులున్నాయి. గస్టావ్ ఫ్లాబర్ట్ (1821-80) కు శేడ్ మీద విపరీతాభిమానం. అతడి తెలివితేటల్ని శేడ్ వెంటాడాడన్నారు.

19వ శతాబ్దానికి చెందిన కౌంట్ డి లాట్రిమాంట్, ఆర్థర్ రింబాడ్, ఫ్రెడరిక్ నీషె, ఆల్ఫ్రెడ్ జారీ మొదలైన వారు శతాబ్ది ప్రారంభంలో సెక్సువల్ పాథాలజీ మీద మానసిక యిష్టతను ఫ్రాయిడ్ సిద్ధాంతం ఆధారంతో అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. ఫలితం సర్రియలిస్టు సాహిత్యం, కళ. సర్రియలిజం ఆధునిక యుగాన్ని ఎంతగా ప్రభావితం చేసిందో అందరికీ తెలుసు. ఆంద్రె బ్రిటన్ (1896-1966) రెండవ సర్రియలిస్టు మేనిఫెస్టో 1930లో వ్రాశాడు.

పాల్ ఎలార్డ్ (1895-1952) ఆధునిక ఫ్రెంచి కవి, సర్రియలిస్టు ఉద్యమ చోదకులలో ముఖ్యమైనవాడు. "శేడ్ మన సంస్కృతికి ఆది మానవుడి సహజ శక్తిని యిచ్చి ఊహాత్మకతకు స్వేచ్ఛను ప్రసాదించాడు. ఆ విధానంలోంచే నిజమైన సమానత్వం ఉద్భవిస్తుంది" అన్నాడు.

లూయిూ బున్యుల్ (1900-83) అనే స్పానిష్ సర్రియలిస్టు నిర్మాత, శేడ్ యొక్క 120 'డేస్ ఆఫ్ సోడం'ని 'ల ఏజ్‌డోర్' (1930) పేరుతో చిత్రీకరించాడు. ఇది బూర్జువా విలువలను రాజకీయాలను విమర్శిస్తుంది. అతడూ శేడ్‌లాగే మన క్రూరమైన ఊహల్ని అణచివేయరాదన్నాడు. ఈ చిత్రం చివర్లో, లాంగ్ షాట్‌లో చాటూ ఆఫ్ సిల్లింగ్, దానిమీద - నేర గ్రూపుల వాళ్ళు వెళ్ళిపోతున్నారు - అనే క్యాప్షన్ ఉంటుంది. పెద్ద గేటు మెల్లగా తెరుచుకుంటుంది. గడ్డం పెంచుకున్న మొదటి శతాబ్దపు హీబ్రూజాతి మనిషి - జీసస్ - బయటికొస్తాడు. శేడు నమ్మకం ప్రకారం అతడొక పనికిరాని ప్రవక్త. అతడు అధికారానికి తలవొంచవలసిందే అనే అర్థంలేని బోధ చేస్తుంటాడు. మరొక లాంగ్ షాట్‌లో డ్యూక్ తన సహచరులకోసం ఎదురుచూస్తుంటాడు. ఓ పదమూడేళ్ళ పడుచు రక్తసిక్తమైన చేతిని రొమ్ములమీద అదుముకుంటూ కనుపిస్తుంది. ఆమె శోషతో గుమ్మంలో పడిపోతుంది. డ్యూక్ ఆమెను యెత్తుకొని

బి.వి. రామిరెడ్డి, విజయవాడ, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పదవీ విరమణ చేసి, ప్రస్తుతం కృష్ణా జిల్లా రుద్రవరంలో నివసిస్తున్నారు.

లోపలికి తీసుకుపోతాడు. కొద్ది సేపటి తరువాత లోపలి నుండి భయంకరమైన కేక వినిపిస్తుంది. అప్పుడే డ్యూక్ తన ముగ్గురు అనుయాయులతో బయటికి వస్తాడు. జీసస్ ఆ హత్యను ఆపుచేయలేడు. ఆఖరి దృశ్యం మంచుతో కప్పబడ్డ శిలువ మీద స్త్రీ తల, చర్మం కప్పబడి వుంటుంది. భయంకరమైన చలి తుఫాను గాలి వీస్తుంటుంది.

ఈ సినిమాను పారిస్‌లో కొన్ని నెలలపాటు ప్రదర్శించారు. ఓ రోజు సాయంత్రం హఠాత్తుగా ఒక ఫాసిస్టు గుంపు సినిమాహాల్లో జొరబడి, ఎర్రసిరా, కుళ్ళిన పదార్థాలు తెరమీదికి విసిరి, లోపల గోడలమీద వున్న సర్రియలిస్టు చిత్రాలను పాడుచేశారు. ఇది శేడు ప్రభావం. శేడ్ యాంటీ ఫాసిస్టు అని ఇందువల్ల తెలుస్తుంది.

పియర్ పాలో పాసోలిని (1922-75) అనే ఇటాలియన్ కవి, నవలాకారుడు, చిత్ర నిర్మాత, శేడు రచన '120 డేస్ ఆఫ్ సోడం' ఆధారంగా 'సాలో' అనే సినిమా తీశాడు. ఈ సినిమా ప్రారంభంలో కొందరు దివాణంలోకి వెడుతుంటారు. వారి తలలకు పైగా ఒక సైన్ బోర్డు ఉంటుంది. దాని మీద 1944లో రెండువేల మంది ఊచకోతకు గురైన 'మార్జా బోట్టో' అనే గ్రామం పేరు వ్రాయబడి వుంటుంది. పాసోలినికి సిల్లింగ్ చాటూ ఫాసిస్టు నియంతృత్వానికి ప్రతీక. ఇది 1930లో పారిస్‌లో జరిగిన ఫాసిస్టు కొట్లాటను గుర్తుచేస్తుంది.

★ ★ ★ ★ ★

1955లో సైమన్ డి బ్యూవాయర్ "షుడ్ వుయ్ బర్న్ శేడ్?" అనే పుస్తకాన్ని వ్రాశాడు. శేడ్ పుస్తకాలన్నింటిని ధ్వంసం చేయాలని పారిస్ లా కోర్టు నిర్ణయానికి కొద్ది రోజులముందే ఈ పుస్తకం వెలువడింది. శేడ్ రచనలకు అనుకరణలు వస్తున్నాయనీ, ఇయాన్ బ్రాడీ, మైరాహిడ్లే లాంటి మూర్స్ హత్యాకారులు తాము శేడు రచనల్ని చదివి ఉత్తేజితులమయ్యామని చెప్పుకున్నారు. హత్యలు, భయంకర హింసలకు పాల్పడేవారికి శేడ్ నించి ఉత్తేజాన్ని పొందవలసిన అవసరం లేదు.

శేడ్‌ని చదవడంలో కొన్ని ఇబ్బందులున్నాయి. శేడ్ రచనల్లో పునరుక్తి ఎక్కువ. తాత్విక చర్చలు, విపరీతపు సెక్సుపోకడలు, హింసలు, చావులు పునరుక్త మౌతుంటాయి. "మానవ మేధస్సుకు పదును పెట్టడానికి, శృంగారంలో వెనుకబడ్డతనాన్ని తొలగించడానికే అలాంటి రచనలు చేశాను. అర్థంలేని భయాలకులోనై, అలాంటి విషయాలను చర్చించలేని, చెప్పుకోలేని మూర్ఖులు చాలమందే వున్నారు" అని శేడ్ అన్నాడు.

సెక్సువల్ బిహేవియర్ విషయంలో శేడ్ లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పటికీ చర్చింపబడుతున్నాయి. గర్భస్రావం పాపమనీ, గర్భస్థ శిశువుకు ఆత్మ వుంటుందనీ గర్భస్రావాన్ని నిషేధించే న్యాయకోవిదుల్ని, గుదశృంగారం న్యాయబద్ధం కాదంటూ నిషేధించిన అమెరికా న్యాయ వ్యవస్థనీ శేడ్ రచనలు వెక్కిరిస్తాయి. సెక్సువిషయంలో 'బలవంతుడిదే రాజ్యం' అనేది శేడ్ అభిప్రాయం.

'జూలియట్' నవలలో ప్రేమ గురించి చర్చ వుంది. ప్రేమ అనేది ఒక భావన. మన ఇష్టా యిష్టాలతో పనిలేకుండా మనల్ని ఎదుటివారివేపు లాగుతుంది. వారితో ఏకం కావాలనే బలమైన కోరిక కలుగుతుంది. ఇద్దరి మధ్య దూరాన్ని అంగీకరించదు. కలయికకు విఘాతం కలిగితే భరించలేని బాధకలుగుతుంది. దాని ఫలితం సౌఖ్యమే. దీనికి శరీరాతీత భావనను కలిగించే శక్తి వుంది. దీని ప్రభావం వల్ల ఎదుటి వారి అవసరాలు, సంతోషాలు, దుఃఖాలు మనవిగా భావించుకుని మన దుఃఖాన్ని రెట్టింపు చేసుకుంటాం. ఇదొక మానసిక భ్రమ. ఒక సున్నిత భావన. ఇది నిరుపయోగమైనది. ఇది ఇంద్రియాలకు ఎలాంటి

సంతృప్తిని ఇవ్వదు. రేషనల్ మానవుడు ఇలాంటి వాటి జోలికి పోకుండా ఎదుటి వారి నుండి సౌఖ్యాన్ని పొందడానికి చూస్తాడు. అందువల్ల అతనిలోని గ్రంధులు ఉత్తేజితమౌతాయి. అవి కోరికను పెంచుతాయి. ఇది అందరిమీద కలగదు. మనకిష్టమైన వాళ్ళమీదనే కలుగుతుంది. అందుకే శారీరకంగా ఆ వ్యక్తి పోయినపుడు మనం దుఃఖిస్తాం. ప్రేమ అనేది ఒక జాతీయ మౌఢ్యం. ప్రపంచంలోని మూడు వంతుల దేశాల్లో సమాజాల్లో పురుషులు వారి స్త్రీలను జాగ్రత్తగా దాచుకుంటారు. వారిలో ఈ ప్రేమలాంటి వక్రభావన రాకుండా జాగ్రత్త పడతారు. ఆ విధంగా స్త్రీల బలహీనతను పురుషులుపయోగించు కుంటారు. ప్రేమ అనేది సౌఖ్యాన్ని పొందాలనే బలమైన కోరిక. ఆ కోరిక ఉన్నంతవరకు స్త్రీని పూజించడం వల్ల ప్రయోజనం లేదు. ఆ కోరిక తీరాక స్త్రీని పూజించలేం. ఆ రకంగా కోరికవల్ల మాత్రమే స్త్రీని గౌరవిస్తున్నాం. గతంలోను, ఇప్పుడు చాలా దేశాల్లో స్త్రీని ఇంకా తక్కువగానే చూస్తున్నారు.

మనల్ని ఆత్మీయులుగా భావించే స్త్రీలు మనకు సంతోషాన్నిస్తారని భావిస్తాం. ఇదొక సెంటిమెంటు మాత్రమే. స్త్రీ ఆత్మీయత మనతో ఆమెకున్న అవసరాలను బట్టి ఉంటుంది. దాన్నే మనం పొగుడుతుంటాం. మన వయసుడిగి, శక్తిపోయి, ఆమె కోరిన వాటిని ఇవ్వలేకపోయినట్లయితే ఆమె మనల్ని వొదిలేస్తుంది. మనకు భయంకర శత్రువౌతుంది. ప్రేమలో దెబ్బతిన్న ప్రియుడు సిగ్గుపడి, మళ్ళీ ఎప్పుడూ అలాంటి తప్పు చేయకూడదనుకుంటాడు.

పురుషుడికీ స్త్రీకీ మధ్య వున్న తేడా మనిషికీ కోతికీ వున్న తేడా, చింపాజీని మన సోదరుడిగా ఎలా అంగీకరించలేమో అలాగే స్త్రీని మనతో సమానంగా అంగీకరించలేం. ఒకే వయసుగల ఇద్దరు నగ్న స్త్రీ పురుషుల్ని ప్రక్కప్రక్కన నించోబెట్టి పరిశీలించండి - స్త్రీ అన్నీ పోగొట్టుకుని పతనమైన పురుషుడి రూపమేనని గ్రహిస్తాం. అంతర్గతంగా కూడ ఈ తేడాలుంటాయి.

స్త్రీలను గురించి చెప్పిన విషయాలు పురుషులకి కూడా వర్తిస్తాయి. మన లోపాలు వారిలోపాల లాంటివే. ప్రతిబంధమూ శారీరక స్వేచ్ఛకు ప్రతిబంధకమే. సౌఖ్యానికి ప్రధానంగా కావలసింది అధికారం (సుపీరియారిటీ). సంతోషాన్ని పంచుకునే వాడికి దక్కే సంతోషం తక్కువే. ఆమెకు లోబడే వాడికి దొరికే సౌఖ్యం సున్న. సంతోషాన్ని పంచుకోవడమనేది ఒక మానసికమైన స్టంట్ మాత్రమే.

వ్యక్తిగతంగా సంపూర్ణంగా అనుభవించండం ప్రకృతి న్యాయ సూత్రం. ఎదుటివారిని శాశ్వతంగా ప్రేమించడం అసాధ్యం. అనుభవించాక కుక్క, పావురం తమ పార్టనర్‌కి నమస్కరించవు, ముద్దెట్టుకోవు. ప్రేమ ఒక అవసరం మాత్రమే సంతృప్తిని పొందాక కుక్క మళ్ళీ ఆడకుక్క ముఖం చూడదు. మళ్ళీ కోరిక కలిగితే తప్ప. ఆ విధంగా ప్రేమ అవసరాలను వ్యక్తీకరించే ఒక అభిరుచి మాత్రమే. అదొక శారీరకాకర్షణ, పిచ్చికోరిక. అదొక భౌతికావసరం. అవసరానికి సౌకుమార్యాలను అంటగట్టడం అహంకారం వల్ల జరిగే తప్పు. పువ్వంటే ఇష్టం లేకుండ దాని సువాసనను ఇష్టపడడం పిచ్చితనం కాదా?

అయితే ప్రేమపూజ గ్రీకులు, రోమనుల కాలం నుంచీ వుంది. 'ప్రేమ ప్రకృతి నేసిన వస్త్రం మీది ఎంబ్రాయిడరీ' అన్నాడు వాల్టేర్. ప్రేమ పర్యవసానం శారీరక కోరికల సంతృప్తే. కొత్త సౌఖ్యాలు పాత స్మృతుల్ని చెరిపేస్తాయి. పోగొట్టుకున్న వాటిని గురించిన భావాలు ఎక్కువకాలం నిలవవు. కోరికలను నొక్కి వేయడం వల్ల అది పెరుగుతుంది.

మృత్యువును గురించి చర్చిస్తూ మానవ, జంతు, వృక్ష ప్రపంచాలను కలిపే కనుపించని బంధం ప్రకృతి సూత్రం. జీవులన్నింటినిలోను జీవం మృత్యువే. రెండూ మనలోనే వుంటాయి. మృత్యువు అనేది ఒక భావన. అది భావనలో మాత్రమే వుంది. చలన రహితమైన పదార్థం రూపాన్ని కోల్పోయి మట్టిలో కలసి పోతుంది. దానికి శక్తి నిస్తుంది. మళ్ళీ అది పైన చెప్పిన మూడు ప్రపంచాలను పునరుజ్జీవింప జేస్తుంది. అందుచేత జీవానికి మృత్యువుకు తేడాలేదు. అలసిపోయిన పదార్థం తిరిగి నేలతల్లి గర్భంలో కలసి పునరుజ్జీవిస్తుంది. అప్పుడది ప్రకృతి సూత్రాల నుండి విడివడుతుంది.

ఒక ప్రాచీన వేదాంతి యుద్ధం అన్నింటికీ తల్లి అన్నాడు. మానవుడు నేనే నాశనం చేస్తున్నాను, చెయ్యగలనని బడాయిపోతాడు. మనిషి దేని రూపాన్నీ మార్చలేడు; నాశనం చేయలేడు. మనిషి పదార్థాన్ని తగ్గించలేడు. శాశ్వతమైన దానిని ఎవడు నాశనం చేయగలడు? మృత్యువు పదార్థ స్వరూపపు మార్పే తప్ప మరేమీ లేదు. జీవితం నాలుగు మూలకాల కలయిక. అయిదో మూలకమైన మృత్యువు ఆ కలయికను విడదీసి వాటి స్వంత రూపంలోకి పంపుతుంది.

★ ★ ★ ★ ★

శేడ్‌ని చదువుతున్నప్పుడు అతడు శారీరకంగాను, మానసికంగాను కూడా జైలులో వున్నట్టనిపిస్తుంది. అతడు ఆలోచనను తర్కంతో జోడించి అభిప్రాయాన్ని బలంగా వ్యక్తీకరిస్తాడు. అతడు తన పరిస్థితుల మధ్య బంధీ అయ్యాడు. అందువల్లనే అతనిలో ఒక పార్శ్వపు ప్రగతి కనుపిస్తుంది.

శేడ్ హింసను సెక్సు సౌఖ్యానికి ఒక ఆలంబనగా భావించి ప్రబోధించాడు. లాని హేళన చేశాడు. మతం మీద దాడి చేశాడు. అతడు కేవలం వక్ర శృంగార జీవి కాదు. ఆధునిక సెక్సు సైకాలజీ నిర్మాణ మేధావుల్లో శేడ్ వొకడు. లైంగిక సంతృప్తికోసం సహజాతాలను స్వేచ్ఛగా ఉపయోగించు కోవాలనేది శేడ్ నమ్మకం. న్యాయ సూత్రాలు, సాంఘిక సూత్రాలు మనుషులు సృష్టించినవి. ఇవి సంఘాన్ని బట్టి, కాలాన్ని బట్టి మారుతుంటాయి. ఈ విషయంలో శేడు అభిప్రాయాలు హ్యూమ్, లాకె లాంటి తాత్వికుల అభిప్రాయాలకు దగ్గరగా వుంటాయి.

శేడ్ అస్థిత్వ వాది. తన జైలు హింసను భావనా శక్తితో జోడించి రచనలు చేశాడు. శేడ్ ఎందరో మహా రచయితల్ని ప్రభావితం చేశాడు. 1937లో రోజర్ మార్టిన్ డు గార్డ్ తన నాటకం "అన్‌టాసిటర్స్"కి నోబెల్ బహుమతిని అందుకున్నాడు. ఈ రచన మీద శేడ్ ప్రభావం వుంది. శేడ్ ప్రభావానికి అంతం లేదు. శేడ్‌ని అన్యాయంగా ఇబ్బందులకు గురిచేశారు. అయితే అతను ధైర్యశాలి, స్థిరచిత్తుడు.

మతం అనేది ఆధ్యాత్మికత కాక, కేవలం ఒక ఫార్మాలిటీగా మిగిలిపోతున్న ఈ రోజుల్లో అధికారం, ధన సంపాదన కోసం ఎన్నో అడ్డదారుల్ని తొక్కుతున్న రాజకీయాలు; విద్య పేరుతో అవిద్య, అహంకారం, అడ్డగోలు తనం విచ్చలవిడిగా చెలామణీ అవుతున్న విధానాలు, - ఈనాటి మనిషికి దైవభీతి, పాపభీతి, నీతి, నియమాలు, సాటి మనిషి మీద సహానుభూతి లేవు. ద్వేషం అంతర్జాతీయ సంపద అయింది. ప్రతి మనిషిలోను శేడ్ చెప్పిన లక్షణాలు ఏదో వొక రూపంలో, ఏదోవొక సందర్భంలో బహిర్గతమౌతున్నాయి. ఫలితం అశాంతి. వక్రతలు, భయంకర రోగాలు. శేడిజం (శాడిజం) అనేక రూపాలలో మనుషుల్లోంచి భల్లూకంలాగ తొంగి చూస్తోంది. అందుచేత ఫ్రాయిడ్‌కి లాగ శేడ్‌కి ఈ యుగంలో ప్రాధాన్యత ఏర్పడింది. మనస్తత్వ శాస్త్రం, ప్రకృతి శాస్త్రం - ఒక్క మాటలో చెప్పాలంటే మానవ సమాజం ఉన్నంతకాలం శేడ్ లేవనెత్తిన ప్రశ్నలు చర్చింపబడుతూనే వుంటాయి. ఫ్రాయిడ్ లాగానే శేడ్ అనంతంగా మిగిలిపోయే తాత్త్వికుడు.

(సమాప్తం)

# డా॥ సంజీవదేవ్ భావసాంద్రత - పరిణామాలు ఒక పరిశీలన

- ముంగర జాషువా

ఒక దృశ్యం అంతరిస్తే
ఇంకొక దృశ్యం ప్రత్యక్షమౌతుంది - పయనంలో !
ఒక భావం అంతరిస్తే
ఇంకొక భావం పల్లవిస్తుంది - భావగమనంలో!

భావాలు, రసభావాలు, వైజ్ఞానిక భావాలు, తాత్త్విక భావాలు, అనే వాటితో పాటు, భావాభావాలు, స్వభావాలు, ప్రభావాలు ఇంకా అనేకం మనకు భావ ప్రపంచంలో కనిపిస్తాయి, వినిపిస్తాయి. భావ ప్రపంచం ప్రపంచంకన్నా విస్తృతమైనది. సామాన్యుడి భావాలు చిన్న పరిధికి పరిమితం అయితే మేధోజీవి భావాలు విశ్వాన్ని చుట్టి వస్తాయి. అతనిలో 'జిజ్ఞాస' అతీతాన్ని దర్శించాలని ప్రయత్నిస్తుంది.

డా॥ సంజీవదేవ్ క్రాంతదర్శి. ఆయన దృష్టి కవిత్వం నుంచి, చిత్రకారత్వం నుంచి, కళా సమీక్ష నుంచి తత్త్వ దర్శనం వరకు పయనించింది. మనస్తాత్విక మానవతావాదం (Psycho-humanism) అనే నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. సంస్కృతీపరంగా సంజీవదేవ్ భావ సాంద్రతను, పరిణామాన్ని స్థూలంగా పరిశీలించడం ఈ వ్యాసోద్దేశం.

రసాస్వాదన, రసదృష్టి, సౌందర్యారాధన, సమీక్షాత్మక దృక్పథము, మనోవిజ్ఞానం, తత్త్వచింతన, నూతన సిద్ధాంతాల ఆవిష్కరణ అనేవి కొంత భిన్నత్వం కలిగివున్నప్పటికీ ఒకే కొమ్మకు పూచిన పూలు. సంస్కృతికి సంబంధించిన మౌలికాంశాలు. సమగ్ర మానవుడు రూపొందాలంటే ఇవి అన్నీ అవసరమైనవే! అందువల్లనే, సంజీవదేవ్ రచనలు పైన పేర్కొన్న మౌలికాంశాలకు సంబంధించినవై, మానసిక శక్తులైన అనుభూతి, ఆలోచన, ఇచ్ఛాశక్తి, క్రియాశీలత అనే వాటిని 'సాంద్రతరం' చేయడానికి తోడ్పడతాయి.

సమాజం అంటే 'bundle of contradictions' తో కూడిన ఒక అవ్యవస్థ. అనేక సమూహాల ప్రవాహం. ఈ ప్రవాహాలన్నీ ఒక విశ్వ సంస్కృతి వైపు పయనించాలని రచనల ద్వారా స్వీయ జీవనకళ ద్వారా ప్రయత్నించిన మహామనిషి డా॥ సంజీవదేవ్!

ఒక కవిగాని, రచయిత గాని, అనేక రంగాల్లో సృజన సాగిస్తున్నప్పుడు, ప్రతిభ పల్చబడి, తరగిపోయే అవకాశం వుంది. అందువలన, ఎక్కువ భాగం కళావేత్తలు, సాహితీవేత్తలు, ఒకటీ, రెండు ప్రక్రియలకు మాత్రమే పరిమితం ఔతారు. సంజీవదేవ్, ఆ విధంగా కాకుండా కవీ, కళా సమీక్షకుడు, చిత్రకారుడు, బహుభాషావేత్త, మనోవైజ్ఞానికుడు, తత్త్వ చింతనాశీలి. ఒక 'సూర్యుడు' అనేక జలాశయాల్లో భాసించినట్లు, ఆయన సంస్కృతికి సంబంధించిన అనేక రంగాల్లో భాసించారు. అందుకే ఆయన ఇంటిపేరు 'సూర్యదేవర' అయిందేమో తెలియదు!

ఆంధ్రదేశంలో ఎక్కువభాగం కవులూ, పండితులూ, చిలుక, హంస రాయబారాల్లోనూ, అవధానాల్లో, 'అరసున్న' ఉపయోగించాలా? వద్దా? బండి 'ఱ' ప్రయోజనాలేమిటి? నియోగి కవులు గొప్పా? వైదిక

ముంగర జాషువ, కెనాల్సు, "గీతిక" హిల్‌కాలని, నల్లగొండ జిల్లా.

కవులు గొప్పా? శైవమా? వైష్ణవమా? గ్రాంథికమా? వ్యవహారికమా? లాంటి అంశాలలో ఇరుక్కుపోయి, వాదోప వాదాల్లో ప్రొద్దుపుచ్చుతున్న సమయంలో, తెలుగువాడి దృష్టి విశ్వవ్యాప్తం కావడానికి, ప్రాచ్య పాశ్చాత్య మేధో జీవులను, రసజీవులను, ఆంధ్రదేశానికి పరిచయం చేశారు. వారు చేసిన పరిచయాలు ఎంతో విశిష్టమైనవి. వాటిల్లో మచ్చుకి: పికాసో, ఎడ్లర్, బెర్ట్రాండ్ రస్సెల్, నికోలస్ రోరిక్, ఆల్డస్ హక్స్లీ, ఫ్రాయిడ్, యూంగ్, రెహమాన్ చుగ్ తాయ్ లాంటి అనేకులైన మేధో జీవులు, కళాకారులతో పాటు భారతీయులైన జిడ్డు కృష్ణమూర్తి, రవీంద్రుడు, అరవిందుడు, హారీంద్రుడు, దామెర్ల రామారావు, ఎస్.వి. రామారావు, ఆచార్య సచ్చిదానంద మూర్తి లాంటి ప్రఖ్యాతులనెందరినో సమగ్రపరిచయం చేసారు. వీరేకాకుండా, ఆంధ్రదేశంలో హేమాహేమీలయిన త్రిపురనేని రామస్వామి చౌదరి, గోపీచంద్, బుచ్చిబాబు, బాపిరాజు, అచంట జానకీరామ్, గొర్రెపాటి, వేగుంట మోహన్‌ప్రసాద్ లాంటి అనేకుల గురించి తామరతంపరగా వ్యాస పరంపరను సాగించారు. ఇవి అన్నీ సృజనాత్మక సమీక్షా ధోరణిలో సాగినవే! సంజీవదేవ్ పరిచయ స్రవంతి ఏ విధంగా ప్రవహించినదో తెలపడానికి ఒక చిన్న ఉదాహరణ: విఖ్యాత చిత్రకారుడు అసిత్‌కుమార్ హల్దార్ గురించి ఈ విధంగా వ్రాస్తారు: "హల్దార్ విద్యాభ్యాసం క్రమపద్ధతిలో ఎక్కడా జరగలేదు. ప్రాథమిక విద్యపూర్తికాగానే ఆయన చిత్రకళాధ్యయనం నిమిత్తం కలకత్తా చిత్ర విద్యాలయంలో ప్రవేశించి అవనీంద్ర టాగూర్ అధ్యాపన క్రింద శిక్షణ పొందనారంభించాడు. నందాలాల్ బోసుకన్నా పది సంవత్సరాలు చిన్నయినా చిత్రవిద్యలో మాత్రం ముందడుగులో వుండేవాడు. బాల్యం నుంచి ఆయన తాతగారైన రవీంద్రుని ప్రభావం తనమీద బాగా పడుతూ వుండటం వల్ల చిత్ర రచనతో పాటు కవితా రచన గూడా చేస్తుండేవాడు. ఆయన కవితలు బెంగాలీ తెలియని వారికి తెలియవు. ఆయన చిత్రాలు మాత్రం భాషా ప్రతిబంధకాన్ని దాటి కన్నులున్న ప్రతి వారికి తెలుస్తవి. బొమ్మలది అంతర్జాతీయ భాష." కళాస్రష్టలను గురించి పరిచయం చేయడంలో చిత్రకళా సమీక్షలు, సాహితీ సమీక్షలు చేయడంలో కొంత ప్రబేధాన్ని చూపిస్తారు సంజీవదేవ్. ఎందుకంటే వ్యక్తి అనేసరికి జీవిత విశేషాలు, పరిసరాలు, వ్యక్తిత్వంలోని నిమ్నోన్నతాలు, అతనిలోని ప్రేరణాత్మక దశలు మొదలైనవి చోటు చేసుకుంటాయి. కళా సమీక్ష అనే సరికి ఎక్కువగా శాస్త్ర దృక్పథం, విశ్లేషణాత్మక వైఖరి లాంటివి ప్రధానం ఔతాయి. ఒకటి వ్యక్తిగత దృక్పథం, మరొకటి వస్తుగత దృక్పథము. ఈ ప్రబేధం తెలియని కొందరు "సంజీవదేవ్ వ్యాసాల్లో కొన్నిటికి లోతుల్లేవు" అని 'చప్పటి' విమర్శచేశారు. అది ఏమాత్రం పరిగణించ నవసరం లేదు.

ఈ విధంగా రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన కవులను, చిత్రకారులను, శిల్పులను, భాషావేత్తలను, మేధావులను, తెలుగువారికి పరిచయం చేసిన ఖ్యాతి సంజీవదేవ్‌కి మాత్రమే దక్కినది. వివిధ దేశాల్లోని మేధోజీవులు, కళాజీవులు తెలుగులో 'మూర్తిమత్వాన్ని' పొందారు. తెలుగు ఎకాడమి ప్రచురించిన 'సంజీవదేవ్ వ్యాసాలు' అనే గ్రంథ పీఠికలో ప్రచురణ కర్తలు "స్వయంగా మహామానవుడైన సంజీవదేవ్ అనేకమంది మహామానవుల గురించి తెలుగువారికి పరిచయం చేశారు" అని ఉట్టంకించడం ప్రత్యక్షర సత్యం ఔతుంది.

సంజీవదేవ్ లేఖలు కూడా మనోజ్ఞంగా, భావ సాంద్రత కలిగి ఆత్మీయముద్రతో, మైత్రీ భావప్రేరకంగా, రమ్యాక్షరాలతో నిండివుంటాయి. కళాశాల విద్యార్థుల నుంచి విశ్వవిద్యాలయ ఆచార్యుల వరకు ఆయనకు ఉత్తరాలు వ్రాసి హేతుబద్ధమైన జవాబులను పొందారు. ఈ వ్యాసకర్త సంజీవదేవ్‌కి వ్రాసిన ఉత్తరంలో విఖ్యాత ఆంగ్ల సాహితీవేత్త Y.B. Yeats గీతాంజలికి వ్రాసిన పీఠికను, చలం

అనువాద 'గీతాంజలికి' దేవ్‌జీ వ్రాసిన పీఠికతో పోల్చి సమీక్షిస్తూ "ఆంగ్లపీఠిక కన్నా తెలుగు పీఠిక ఎక్కువ భావసాంద్రత కలిగివున్నదని" వ్రాసినప్పుడు దానికి 'సంయమన మూర్తి' ఈ విధంగా జవాబు వ్రాశారు. రసరమ్యంగా! "రవీంద్రుని గీతాంజలికి 'సందేవ్' వ్రాసిన పీఠిక ఎక్కువ సత్తా కలిగివున్నది ఏట్స్ వ్రాసిన పీఠికకంటే అనేదానితో నేను వినయంగా అంగీకరిస్తాను, ఆయన నాకంటే అనేక విధాలుగా గొప్పవాడు అయినప్పటికి ఒక్కోసారి కొద్దివాళ్ళు కొన్ని సందర్భాలలో గొప్పవాళ్ళను మించుతారు. అంతమాత్రాన ఆ కొద్దివాళ్ళు గొప్పవాళ్ళు కారు'' అని తన వినమ్రతను చాటారు సంజీవదేవ్.

సామాన్యంగా, ఒక సాహితీ స్రష్ట ఇంకొక సాహితీ స్రష్టను మెచ్చుకోవడం అరుదు. జరగకపోవచ్చు కూడా! 'సంజీవదేవ్, మంచి కవి' అని అంటే ఆయన బహుముఖ ప్రజ్ఞను ఎక్కడ అంగీకరించాలోనని చాలామంది సాహితీ పరులకు భయం. అయితే ఆంధ్రాంగ్ల భాషల్లో ఉత్తమ స్థాయి కవితాసృజన సాగించారు. బెంగాలీ భాషలో కూడా నాలుగైదు కవితలు వ్రాసినట్లు గుర్తు. 'Blue Booms' 'తెల్ల మబ్బులు' అనే కవితా సంపుటాలను ఆంధ్రాంగ్ల భాషల్లో వెలువరించారు. ఆంగ్లంలోను, తెలుగులోనూ, తక్కువ పదజాలంతో సౌందర్య తత్త్వం సడలని, తాత్త్విక దృక్పథంలో కవితలు వ్రాయడం ఆయన పద్ధతి!

కవితా వస్తువుని ఎన్నుకోవడంలో ప్రత్యేక దృష్టి ఆయనది. కృష్ణమూర్తి గురించి వ్రాస్తాడు, కుష్టువ్యాధి పీడితుని గురించి వ్రాస్తారు సమదృష్టితో! ఏది వ్రాసినా సత్యస్ఫూర్తితో, మానవీయ విలువలతో, సౌందర్యాత్మకంగా వుంటుంది. ఉదాహరణకు "J.K. a poetic realist" అనే కవితలో:

| | |
|---|---|
| "He did never preach | "అతనెప్పుడు ఉపదేశించలేదు |
| Nor did he teach | బోధించనూ లేదు- |
| He song Life's chairoscuro | అతను జీవితపు వెలుగునీడల్ని గానం చేశాడు |
| He was a singer of life | అతనొక జీవన గాయకుడు |
| And Simultaneously | అదే సమయంలో |
| He was song itself | అతనే ఒక పాటయినాడు |
| Krishna murthy | కృష్ణమూర్తి |
| was not a figment | ఊహాజీవి కాదు |
| But a lumanious pigment" | అతనే ఒక ప్రాజ్వల వర్ణం |

(వ్యాసకర్త స్వేచ్ఛానువాదం)

తెలుగులో 'తెల్లమబ్బులు' అనే సంపుటిలో ఆయన శైలి, విలక్షణత స్పష్టంగా కనిపిస్తాయి. 'అంధబాల' అనే కవిత పాఠకుడిలోని మానవీయతను తట్టిలేపి దుఃఖస్పర్శలో పునీతుడ్ని చేస్తుంది. ప్రపంచంలో అంధత్వం పడే ఆవేదన ఒక 'అంధబాల' లో నిక్షిప్తమైంది. మచ్చుకి కొన్ని పంక్తులు...

"ఆమెకు లేదు దృష్టి
అందుకే రంగు అంటే అంత తృష్ణ
ఎరుపూ తెలుపూ ఊదా
పసుపూ హరితం నీలం
మందారాన్ని స్పృశిస్తుంది మల్లికను

రుచి చూస్తుంది గులాబీని
ప్రశ్నిస్తుంది వాటి రంగులను
ఎరుపేమో తెలుపేమో
ఎరుగనే ఎరుగదు ఆమె
అన్ని రంగులూ ఒకటే ఆమెకు
గుర్తిస్తుంది పూలను తావినిబట్టి
తల్లి అంటుంది తనయతో
'చిలుకరంగు పచ్చన'
చిరునవ్వు నవ్వుతుంది అంధబాల
చిలుకరంగూ ఎలుకరంగూ ఒకటే ఆమెకు
తమ్ముడు అంటాడు
'ఇంద్రధనుసు, ఇంద్రధనుసు'
పై కెత్తుతుంది తలను నిరాశతో -
గగనానికి త్రిప్పుతుంది
కనుపించని కళ్ళు
రాలుతాయి కన్నీళ్ళు కపోలాలపైకి"

సంజీవదేవ్ కవితలు అనేకం ఉదహరించవచ్చు. విస్తరణభీతి. చిన్నప్పుడు జోగేంద్రదేవ్ 'ఐస్'కోసం ఏడుస్తున్నప్పుడు వ్రాసిన 'ఐస్' పాట, దివిసీమ ఉప్పెన తరువాత 'తెల్లకాకి' అనే కవిత, 'తుమ్మల' వారిపై వ్రాసిన దీర్ఘకవిత, లాంటి మంచి కవితలు ఎన్నో వున్నాయి. ఆయన కవితా భాండాగారంలో!

కవిత్వం 'ఫలానా సిద్ధాంతం అడుగుజాడల్లో నడవాలి' అనే నిశ్చితాభిప్రాయం ఉన్నవారికి, కవిత్వ విమర్శలో స్వీయ దృష్టిని రంగరించే దృష్టివాదులకి సంజీవదేవ్ కవిత్వం రుచించదు. దేవ్‌జీ కవితలు, సరళ స్వభావులకు, 'ఉన్నదాన్ని ఉన్నట్లు స్వీకరించేవారికి' వస్తు నియమం లేనివారికి, విముక్త మానవులకు బాగా నచ్చుతాయి. అందువలన సంజీవదేవ్ "ఉత్తమస్థాయికవి" అనడంలో ఎలాంటి సందేహం లేదు.

సంజీవదేవ్ కవితా సృజన, చిత్ర రచన ఒకే స్థాయిలో వుంటాయి. ప్రధానంగా ప్రకృతి చిత్రకారుడు. ఆయన మాధ్యమం జలవర్ణాలు (water colors), తైలవర్ణాలు (oil colors), పేస్టల్స్, అక్రిలిక్ పేయింట్స్ కూడా వాడతాడు. ప్రకృతిలోని రమణీయతను, గంభీరతను, మహాస్తబ్ధతను లేక మహాశాంతతను, రసతన్మయత ద్వారా, చిత్రరచన ద్వారా అందుకోవాలని ప్రయత్నించి సఫలులైనారు సంజీవదేవ్! ఆయన ప్రకృతి చిత్రాలు వందల్లో వుంటాయి. కంటికింపైన రంగుల మిశ్రమంలో భావస్ఫోరకంగా వుంటాయి. ఆయన తన ప్రకృతి చిత్రాలను గురించి వ్రాస్తూ "I am visual a artist, a painter especially a painter of land scape, depicting the rhytham of the forms of nature, both organic and inorganic, as well as the tune of colour of the delicate changing moods of the atmosphere" అని అంటారు.

సంజీవదేవ్ చిత్రాలతో పాటు, ఆయన కళా సమీక్షలు కూడా రమణీయమైనవి, గంభీరమైనవి కూడా! భాషా శైలిని బట్టి ఒక Rhytham and harmony ని కలిగి వుంటాయి. గనుక Music in

Logic అని అంటారు, కొంతమంది! సంజీవదేవ్ వ్రాసిన 'నాట్యం' అనే వ్యాసంలో, "ఏదీ స్థితి శీలంకాదు. అంటే ఏదీ కదలకుండా వుండదు. రంగు, రేఖా, వాక్కూ గతీ, లయా మొదలైన వాటిలో నిండిన యీ విస్తృత విశ్వంలో అంతాగతి శీలమే. గతి లేక కదలిక యీ విశ్వసృష్టిలోని ప్రధాన గుణం. వాస్తవానికి అచేతన వస్తువులు కూడా స్థితి శీలం కావు. కదలికతోనే నిండి వుంటాయి.

అచేతనాలూ, సచేతనాలూ అన్నీ కూడా కదులుతూనే వుంటాయి. నిరంతరంగా అజ్ఞాత గమ్యస్థానం వైపుకు కదలిపోతూనే వుంటాయి. చంచలంగా; కదలిక అనేది సజీవమైన ప్రాణస్పందనకు గతిశీల చిహ్నం. ఉత్తకదలిక నాట్యం కాలేదు. లయశీలమైన కదలిక మాత్రమే నాట్యం. ప్రతి కదలిక లయ కాలేదు, కాని ప్రతి లయా మాత్రం కదలికే అవుతుంది" అని అంటారు మనోజ్ఞంగా!

సంజీవదేవ్ కళా సమీక్ష ఎంతో గంభీరమైనది. మూలాలను స్పృశిస్తుంది. లలిత కళలన్నిటి మీద ఆయన 'సాధికారత' స్పష్టంగా కనిపిస్తుంది. మాతృకళ అయిన సాహిత్యంతో చిత్రకళ, శిల్పకళ, వాస్తు, సంగీత, నాట్యకళలను గురించి, ఆయన గవేషణ విశిష్టంగా వుంటుంది. కళాచరిత్రలను గురించి కూడా సమగ్రంగా విశ్లేషించారు. మొగలాయి, దక్కను, ముస్లిం చిత్రకళలతో పాటు గోతిక్, రష్యన్, చైనీయ చిత్రకళలను గురించే కాకుండా అనేక చిత్ర, శిల్ప సాంప్రదాయాలను ఆయన విశ్లేషించారు. ఆదిమ మానవుడి దగ్గర నుంచి ఆధునికాంతర మానవుని వరకు జరిగిన కళా పరిణామాన్ని సమీక్షించారు. ఆయన కళా సమీక్షలో విఖ్యాత తత్త్వవేత్తలయిన కాంట్, హెగెల్, టి.యస్. ఇలియట్, యూరీ బొరోవ్ లాంటి వారికి ఏ మాత్రం తగ్గరు. ఒక్కోసారి ప్రతిభకు, కీర్తి ప్రతిష్టలకు ఏ మాత్రం సంబంధం వుండదు.

సంజీవదేవ్ వ్రాసిన పీఠికలు ఎంతో విలువైనవి. మచ్చుకి వాటిల్లో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీచే ఉత్తమ గ్రంథంగా బహుమతి పొందిన కీ.శే. కొండిపర్తి శేషగిరిరావు గారి "సమన్వయ స్వరాలు" గంథ పీఠిక ఎంతో విశిష్టమైనది. తన అడుగుజాడల్లో నడచి, తననే కళాతత్త్వ మీమాంసలో dominate చేయాలని, నాలుగు దశాబ్దాల కాలం ప్రయత్నించిన శ్రీ కొండిపర్తి శేషగిరిరావు గ్రంథానికి, ఎలాంటి అరమరికలు లేకుండా ఆయన పీఠిక వ్రాయడం ఎంతో సహృదయత వుంటే గాని సాధ్యంకాని విషయం. కీ॥శే॥ కొండపర్తి వ్రాసిన "సమన్వయ స్వరాలు" ఎంతో క్లిష్టమైన గ్రంథం. లలిత కళల సమన్వయంలో నూతన సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన గ్రంథం. ఆ గ్రంథానికి సంజీవదేవ్‌తో పాటు హేమాహేమీలయిన భరత కళాప్రపూర్ణ డా॥ నటరాజు రామకృష్ణ, 'సాహిత్య బ్రహ్మ' డా॥ V.VL. నరసింహారావు గారలు పీఠికలు వ్రాశారు. సంజీవదేవ్ "సమన్వయ స్వరాలు" గ్రంథ పీఠికలో "విభిన్నాల కూడలి అభిన్నపు సుస్థితిని సంస్థాపిస్తుంది. మనిషి శరీర నిర్మాణానికి ఎన్నెన్నో వేరు వేరు అవయవాలు కావాలి. శరీర నిర్మాణం కాకముందు ఆ అవయవాలు వేర్వేరు రూపాలతో, వేర్వేరు నామాలతో వుంటాయి. శరీర నిర్మాణం పూర్తి అయిన తరువాత అవన్నీ కలిసి శరీరం అనే పేరును, శరీరపు రూపాన్ని పొందుతాయి. వీణ, వేణువు, వైలెన్, సితార, మృదంగం, ఘటం, ఖంజరి మొదలైన భిన్న భిన్న వాయిద్యాలు కలసి జంత్ర సమ్మేళనం, కళలన్నీ కలసి రసమేళన అవుతాయి. అటువంటి రసమేళనను నిర్మించే ప్రయత్నమే ఈ సమన్వయ స్వరాలు. ఈ గ్రంథకారుడు శ్రీ శేషగిరిరావుది గొప్ప సమన్వయ దృష్టి, గొప్ప ఏకతా దృష్టి... సమగ్రానుభూతి ఆయన జీవన సరళి. ఆయన స్వయంగా చిత్రస్రష్ట, సాహితీ స్రష్ట, సంగీత స్రష్ట, వీటన్నిటి సమన్వయతాస్రష్ట" అని వాస్తవాన్ని విశదీకరించడం మరచిపోరు.

సంజీవదేవ్ ఈనాడు కళారంగంలో ఎక్కువగా కనిపిస్తున్న "రాగద్వేషాలకు", "సాహితీ ముఠా మేస్త్రీలకు" అతీతుడు, వ్యతిరేకి కూడా! తన సిద్ధాంతాలను, జీవన సరళిని వ్యతిరేకించే కవి, పండితులు వచ్చినా, తుమ్మపూడి 'రసరేఖ' నివాసంలో ఆరోగ్యకరమైన భోజనం పెట్టి, గేటుదాక వచ్చి వీడ్కోలు చెబుతారు మర్యాద పూర్వకంగా!

దాదాపు రెండు దశాబ్దాల క్రితం నేను వ్రాసిన "సత్యాన్వేషణలో సంజీవదేవ్", "మనిషి నుంచి మహామనిషి వరకు" అనే వ్యాసాలు ప్రచురించబడినప్పుడు కొంతమంది విద్యాధికులు, రచయితలు ప్రత్యక్షంగా నాతో సంజీవదేవ్ "తాత్త్వికుడు" కాదని వాదించారు. అయితే ఈ అనుమానం భ్రమాత్మకమైనదే గాని వాస్తవం కాదు.

తత్త్వశాస్త్ర పాండిత్యం అధ్యయనంతో వచ్చేది. తత్త్వచింతన అంత సులభంగా అబ్బేది కాదు. మౌనం, ధ్యానం, మననం, సంయమనం, అంతర్ బాహ్యావీక్షణ, వివేచన, వివేకం లాంటి ఉత్తమ లక్షణాలతో అది అలవడుతుంది. శ్రీ సంజీవదేవ్ తత్త్వశాస్త్ర పాండిత్యము, చింతనా రెండు జమిలిగా ప్రవసహిస్తుంటాయి. ఆయన వివిధ తత్త్వ సిద్ధాంతాలను పరిచయం చేసిన తీరే ఇందుకు సాక్ష్యం. జెన్ బౌద్ధం, ఎగ్జిష్టన్సిలిజం, హ్యూమనిజం, మిస్టిజం, భావ, భౌతిక వాదాలతో పాటు మనోవిజ్ఞాన శాస్త్ర శాఖలన్నిటినీ ఆయన సమీక్షించారు గాఢంగా; ఆయన ప్రతి రచనలోనూ తాత్త్విక దృక్పథం అంతర్లీనంగా ప్రవహిస్తూ వుంటుంది.

డా॥ సంజీవదేవ్ నూతన సిద్ధాంతం psycho-humanism (మనస్తాత్త్విక మానవతావాదం) అనేది పరిశీలించదగినది. అందులో ఆయన ఊర్ధ్వచేతనకు (super consiousness) కి ఎంతో విలువ నిచ్చారు. మానవుడు అధోచేతన నుంచి ఊర్ధ్వ చేతనకు పయనించే మార్గాన్ని ఆయన సుగమం చేశారు. మానవ చేతనలోని అనేక దశలు క్రమ క్రమంగా చైతన్యవంతమై ఒక అజప్రసరితగా, ఊర్ధ్వాభిముఖంగా శక్తివంతమైన క్రియాశీలత వైపు పయనించడానికి దేవ్‌జీ సిద్ధాంతం తోడ్పడుతుంది. ఆయన ప్రసిద్ధ గ్రంథం "Bio-symphony"లో ఈ విధంగా వ్రాశారాయన "Psycho-humanism does not oppose the present humanism but endorse it. While endorsing the humanism the psycho-humanism attaches to it that what it lacks. Psycho-humanism would like to deal not only with the visible man, dealt with already by humanism. The former's concerned with integral man. Then alone the man is the interval when he includes both the visible man is physical man, the invisible man is the psychical man and both make the integral man who is the centre of intrest in psycho-humanism."

ఈ విధంగా మానవతా వాదానికి, మనస్తాత్త్విక మానవతా వాదానికి గల తేడాను చక్కగా వివరించారు. మానవ వాదం, మానవతావాదం, మనస్తాత్త్విక మానవతావాదం అనేవి శాస్త్రీయ దృక్పథంలో కూడిన పరిణామాల్ని సూచిస్తవి!

ఇకపోతే, సంజీవదేవ్‌లో భావ పరిణామం తీవ్రంగా కల్పించారు. కాని పరిణామం మాత్రం జరిగింది. 1940 దశకంలో ఎలాంటి రచనలు, ఉపన్యాసాలు చేశారో, 1990 తర్వాత కాలంలో కూడా అదే భావ సాంద్రత కలిగిన రచనలు, ఉపన్యాసాలు చేశారు. వారిలో వచ్చిన మార్పులు అతిస్వల్పం. అవి అంత ఎన్నదగినవి కాకపోయినా ఒక సత్యాన్వేషకునిలో వచ్చిన పరిణామాన్ని స్థూలంగా పేర్కొనడం అవసరం.

"లేఖల్లో సంజీవదేవ్" అనే గ్రంథంలో ఒక మిత్రుడికి ఉత్తరం వ్రాస్తూ మరణాంతర జీవితాన్ని గురించి శ్రీదేవ్ "మరణాంతరం ప్రేతాత్మలు" ectoplasm అనే పదార్థాన్ని కప్పుకొని ప్రత్యక్షమౌతాయి" అని వ్రాశారు. ఈ వ్యాసకర్త అభావంలోని అవాస్తవికతను ఆయన దృష్టికి తీసుకు వచ్చినప్పుడు ఆయన నిస్సంకోచంగా నిజాయితీగా "ఒకవేళ ఆనాడు నమ్మి వ్రాసినా, యీనాడు నమ్మను. మనిషి భావాలూ, స్వభావాలు మారుతుంటాయి కదా! మారుతుంటాడు గనుకే మనిషి" అని వెంటనే ప్రతిస్పందించారు.

శ్రీ సంజీవదేవ్ ప్రథమంలో "నిర్గుణోపాసనను అభిమానించడం" తరువాత "ఉపనిషత్ తత్త్వం నాకు చిరసత్యం" అని నొక్కి వొక్కాణించడం "శరీరాన్ని వదిలిపెట్టి ఆత్మను ప్రేమించాలి," "దేహి విదేహిగా జీవించాలి" అని ఉట్టంకించడమూ, వారిపై మొదట భావవాద ప్రభావం ఉందని చెప్పాలి. కాలక్రమేణా అది మార్పుచెంది "నేను భౌతిక వాదిని, ఎందుకంటే భావవాదిని కాదు కాబట్టి. నేను భావ వాదిని ఎందుకంటే భౌతిక వాదిని కాదు కాబట్టి" అని స్వయంగా వారికి సమ్యక్ దృక్పథాన్ని వెల్లడించారు. భౌతిక, భావ వాదాలకు సమన్వయించి జ్ఞానమీమాంసను (epistomological enquiry) విస్తృతం చేశారు.

శ్రీ సంజీవదేవ్ 'రూపారూపాలు' అనే గ్రంథంలో భారతీయ ఆత్మతత్త్వాన్ని గురించి చేసిన విశ్లేషణ ఎంతో విశిష్టమైనది.

"భారతీయ తత్త్వం అంతా ఆత్మ శరీరాల భిన్నత్వం మీద ఆధారపడి వుంది. దేహి నశించదు. దేహం యొక్క విలువంతా దేహిమీదనే ఆధారపడి వుంటుంది. ప్రాణం వేరు, ఆత్మవేరు ప్రాణానికి తన్ను గురించిన జ్ఞానం వుండదు. ఆత్మకు తన్ను గురించిన జ్ఞానం వుంటుంది. అంతా ప్రాణం కింద పొరలో ఉన్నప్పుడు ప్రాణ రూపంలో ఉంటుంది. పై పొరలోకి పరిణితి చెందినప్పుడు ఆత్మ అవుతుంది. ప్రాణశక్తి పరిమితం, ఆత్మశక్తి అపరిమితం. అయితే ఈ రెండికన్న భేదం అంత ప్రధానమైనది కాదు" అని అన్నారు.

ఇది సాంప్రదాయ అస్తికులు చెప్పే "ఆత్మ"కు సంబంధించిన ఊహాజనిత వాదం కాదు. భౌతిక సత్తా పరిణామం చెందిన విధానం. పూర్తిగా పదార్థ సంబంధి అయిన "స్థూల-సూక్ష్మ పంచీకరణ"కు చేరువైన వ్యాఖ్యానం.

శ్రీ సంజీవదేవ్ 'Bio-symphony' గ్రంథంలో యీ విధంగా అన్నారు. వాస్తవ దృక్పథంతో "Modern man is previlized to live in age in which there exists no conflict between psychology and para-psychology, between matter and spirit and between empiricism and transcendentalism."

శ్రీ సంజీవదేవ్ సిద్ధాంతాల వైరుధ్యాలను సమన్వయించి, జీవన కళలో వైరుధ్యాలకు తావీయని మహామనిషి, రవీంద్రుని కన్నా సంజీవదేవ్ కవితారంగంలో వెనుకబడివున్నప్పటికీ "జీవన కళలో" ఇద్దరూ సమవుజ్జీలే! 16.01.2005న సంజీవదేవ్ ఫౌండేషన్ వారి పురస్కారం అందుకున్న విఖ్యాత చిత్రకారుడు పద్మశ్రీ డా॥ యస్.వి. రామారావు తన ప్రసంగంలో "రవీంద్రనాథ్ టాగూర్ తెలుగు దేశంలో జన్మించినట్లయితే ఆయన్ను సంజీవదేవ్ అంటారు" అని అనటం ఎంతో సమంజసంగా ఉంది.

శ్రీ సంజీవదేవ్ జీవితం, రచనలు ఆదర్శవాదానికి ప్రతీకలు, వెలుగు రేఖలు, జ్ఞాన పథానికి మార్గదర్శకాలు!

# అమరత్వం పొందిన 74 యేండ్ల అనంతరం భగత్‌సింగ్ లక్ష్యాలు, వ్యక్తిత్వంపై కొద్దిగా

- ప్రజాశక్తిమంతుడు బొమ్మారెడ్డి

"త్యాగం, బలిదానం రెండువిధాలు. ఒకటి: తుపాకి గుండుకు బలికావడం, ఉరితీయబడి చనిపోవడం. ఈ రెండింటిలో ఆకర్షణ అధికంగా వున్నా కష్టం తక్కువే. రెండవది: జీవితమంతా విప్లవోద్యమ బరువును మోస్తూ, పోరాట క్రమంలో ఇంటా బయటా ఏర్పడే ప్రతికూల వాతావరణ సమయాల్లో ఏమాత్రం చలించకుండా తమ లక్ష్యపథాన్ని వీడనివారు, భారానికి భయపడి తమ భుజాలను క్రిందికి దించనివారూ, జ్యోతి మందగించరాదని, అందుకోసం తమను తాము ఆహుతి చేసుకునేవారూ, నిర్మానుష్యమైన మార్గాల్లో చీకట్లు అలముకోరాదని తమను తామే కొవ్వొత్తిలా కరిగించుకునేవారూ, కడవరకు విప్లవోద్యమంలోనే వుండి చివరి శ్వాసను విడిచేవారు. త్యాగంలో గుండు దెబ్బకు గురై లేదా ఉరికొయ్యల నెక్కి ప్రాణత్యాగం చేసేవారికంటే వీరు శ్రేష్టమైనవారు."

మన భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విధించిన ఉరిశిక్షకు గురై ప్రాణాలర్పించి అమరవీరుడై, అందరిచేతా స్వాతంత్ర్య పోరాట మహావీరుడని నేటికీ కొనియాడ బడుతున్న భగత్‌సింగ్ వూహించిన విప్లవకారుని గురించిన సమగ్ర నిర్వచనమిది.

భగత్‌సింగ్ ఉరి తీయబడి నేటికి 74 సంవత్సరాలు. ఈ సందర్భంగా ఆయన విప్లవ వ్యక్తిత్వాన్ని గురించి కొద్దిగా స్మరించుకుందాం.

ఆనాటి విప్లవోద్యమంలో భగత్‌సింగ్ సహచరుడుగా వుండి, ఆ కుట్ర కేసుల్లో అండమాన్ దీవుల్లో చాలా సంవత్సరాలపాటు ఖైదీగావున్న శివవర్మ భగత్‌సింగ్ విప్లవ జీవితాన్ని గురించి రాస్తూ పైన ఉదహరించిన భగత్‌సింగ్ నిర్వచనం కామ్రేడ్ సుందరయ్య లాంటి మహామహులను పదే పదే స్ఫురణకు తెస్తూ మనకు ఉత్తేజమిస్తూ కర్తవ్యోన్ముఖులను చేయడానికి ఉపకరిస్తుందని రాశారు.

శివవర్మ ఆ తరువాత అండమాను జైళ్ల నుండి ఆంధ్రలో రాజమండ్రి జైలుకు మార్చబడి అక్కడ వున్న సుందరయ్యలాంటి వారితో పరిచయమై కమ్యూనిస్టుగా పరిణామం చెందారు. ఆ తరువాత ఆయన ఉత్తరప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి ఇటీవలనే మరణించారు.

భారత స్వాతంత్ర్య సమరయోధుల్లోనూ, విప్లవకారుల్లోనూ అగ్రశ్రేణిలో చేరి నేటికీ మన యువతరానికి స్ఫూర్తిని, ఉత్తేజాన్ని కలిగించే మహోన్నత విప్లవ యోధుడు భగత్‌సింగ్, ఆయన జీవించిన కాలం అతితక్కువ. 23వ యేటనే ఆయన ప్రాణాలను కోల్పోయారు. దేశభక్తి, రాజకీయ ఆలోచన ఆచరణ కూడా ఆయనలో అతి పిన్నవయస్సులోనే రూపొందడం ఆరంభమైంది. అత్యంత త్వరితగతిని గాంధీజి ఉద్యమం తరువాత జాతీయవాదాన్నుండి విప్లవ టెర్రరిజంలోకి ఆయన మారిపోయాడు. అయితే 1927-28 నాటికే భగత్‌సింగ్ మార్క్సిజం వైపుకు మారడం ప్రారంభమైంది. స్వాతంత్ర్య సాధనకు ఆతరువాత సోషలిస్టు విప్లవ సాధనకు వ్యక్తిగత హింసతో కూడిన టెర్రరిజం సరికాదని, కార్మిక, కర్షక, యువజన సమీకరణ, ప్రజా ఉద్యమాల నిర్మాణం, ప్రజాపోరాటాల ద్వారా మాత్రమే బ్రిటీష్ బానిసత్వం నుండి మన మాతృదేశాన్ని విముక్తి చేయడం సాధ్యమనే

వి.ఆర్. బొమ్మారెడ్డి, 'ప్రజాశక్తి' ఎడిటర్‌గా పనిచేశారు, విజయవాడ.

నిర్ణయానికి ఆయన వచ్చారు. తుదకు మార్క్సిస్టు విప్లవకారుడుగా ఆయన ఉరికంబమెక్కి భారత భావితరాలవారిలో ఆదర్శప్రాయుడైన స్వాతంత్ర్య సమరయోధుడైనాడు.

అయితే దురదృష్టవశాత్తూ మనదేశంలో మొట్టమొదట మార్క్సిస్టు సిద్ధాంత ఆలోచనాపరుల్లో భగత్‌సింగ్ ఒకరు అని ఆయన తన జీవిత చరమదశలో మార్క్సిస్టు దృక్పథాన్ని కలిగివున్నాడన్న విషయం చాలామందికి తెలియదు. ఆ కారణంగానే భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌లకు వారి సహచరులకు మన దేశంలో గల బ్రహ్మాండమైన పేరు ప్రతిష్టలను రకరకాల రాజకీయ అభిప్రాయాలను, తుదకు అభివృద్ధి నిరోధకులు, మూఢవిశ్వాసపరులు తమ రాజకీయ ప్రయోజనాలకోసం ఉపయోగించు కోవడం జరుగుతున్నది.

మరోవైపున భగత్‌సింగ్‌లాంటి ఆనాటి విప్లవకారులు ఏమీ తెలియనివారనీ, సిద్ధాంత ప్రాతిపదిక లేని ఏవేవో ఆవేశాలతో వ్యక్తిగత హింసాత్మక చర్యలను గావించేవారనీ అభిప్రాయం కూడా కొంతమందికి వుంది. అయితే వివిధ సమస్యలను పునః పరిశీలించే దృష్టితో లోతుగా అధ్యయనం చేసి తమ గమ్యస్థానం సోషలిజమేనని, అందుకు మార్క్సిజమే శరణ్యమని దృఢ నిర్ణయానికి వచ్చిన విప్లవ మహామేధావి భగత్‌సింగ్. భగత్‌సింగ్, ఆయన సహచరులపై గల దురభిప్రాయాలను తొలగించాలనే ఉద్దేశంతో ఆయనతో చాలాకాలం సన్నిహితంగా పనిచేసిన శివవర్మ భగత్‌సింగ్ రచనలను సేకరించి ఆయన అభిప్రాయాలను ప్రజలకు తెలియపరచాలని నిర్ణయించుకున్నారు. శివవర్మకు అప్పటికే 70 యేండ్లు పైబడ్డాయి. తన జీవిత చరమ దశలో భగత్‌సింగ్ రచనల సేకరణకై ఉద్యమించారు.

23 యేండ్ల వయస్సులోనే భగత్‌సింగ్ చారిత్రాత్మక పురుషుడుగా ప్రఖ్యాతిచెందడం విశేషం. వీరోచిత ధైర్యసాహసాలకు, త్యాగాలకు జాతీయతకు, సోషలిజానికి అంకితమైన ఒక పోరాట యోధుడుగా యువతకు ఆదర్శమై దేశవ్యాపితంగా ఆరాధించబడ్డాడు. ఆయన సామాన్య స్వాతంత్ర్య యోధుడు కాదు. బహుముఖ విజ్ఞాని. పిన్నవయస్సులోనే మార్క్స్, లెనిన్ వంటి మహనీయుల రచనలు చదివి తత్వాలతో ప్రతిభావంతుడైన సోషలిస్టు మేధావిగా తయారై, భారత దేశంలోనే తొలి మార్క్సిస్టు ఆలోచనాపరుడన్న విషయం చాలామందికి తెలియదు.

1980 లో ఒకసారి శివవర్మ కాన్పూరు నుండి లక్నోకు రైలులో ప్రయాణం చేస్తున్నారు. "నేనెందుకు నాస్తికుడను" అన్న శీర్షికతో భగత్‌సింగ్ రాసిన ఒక చిన్న పుస్తకాన్ని చదవడం పూర్తిచేసి ఆయన పక్కనపెట్టగా, తోటి ప్రయాణీకుడొకరు దానిలోని కొన్ని పేజీలు చదివి "భగత్‌సింగ్‌కు ఇలాంటి జటిల సమస్యపై రాయగల శక్తి గలదా" అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. రాజస్థాన్‌లోని ఒక కాలేజీలో ఆయన ఒక లెక్చరర్. విప్లవకారులంటే ఏవో బాంబులతోనూ, రివాల్వర్‌తోనో వ్యవహరించేవారనీ, సాహసవంతులు, త్యాగధనులు అయినప్పటికీ, వారు మనుషులను చంపడంలో ఆనందపడేవారనీ అభిప్రాయం ఆయనకున్నట్లుంది. అలానే భగత్‌సింగ్, ఆయన సహచరులను మన పాఠ్యగ్రంథాల్లో వక్రీకరించిన ఉదాహరణలు కూడా వున్నాయని శివవర్మ తెలుసుకున్నారు. 90వ దశకంలో కూడా అంటే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఉత్తరప్రదేశ్‌లో ఎనిమిదవ తరగతి చరిత్ర పాఠ్య గ్రంథాల్లో చంద్రశేఖర్ అజాద్‌ను గురించి ఇలా రాసివుంది:

"అజాద్ రక్తపాతంతోనూ, దారి దోపిడీలోనూ విశ్వాసమున్న వ్యక్తి. అదృష్టవశాత్తూ మనదేశం అలాంటివారి పోరాట విధానాన్ని చేపట్టకుండా గాంధీజీ మార్గాన్ని చేబట్టే అహింసామార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నది."

ఇది రాసినది ఎ.ఎల్.శ్రీవాత్సవా అనే చరిత్ర రచయిత. బ్రిటీష్ పాలనా కాలంలో వారి ప్రభావంతో గొప్ప చరిత్రకారుడని పేరుతెచ్చుకున్న వ్యక్తి ఆయన.

ఈ పొరపాటు అభిప్రాయాలను తొలగించాలన్న అభిప్రాయంతో భగత్‌సింగ్, ఆయన అనుచరులను గురించి, సామాన్యులకే గాక విద్యావంతులకు సైతం గల పొరపాటు అభిప్రాయాలను తొలగించే లక్ష్యంతో శివవర్మకు భగత్‌సింగ్ రచనలను సేకరించి ప్రచురించాలనే సంకల్పం మరింత ధృవపడింది. భగత్‌సింగ్ తన సహచరులకంటే మేధావేగాక, ఉదాత్తమైన వ్యక్తి అని, ఆయనతో సన్నిహితంగా పనిచేసిన శివవర్మ తన అనుభవం ద్వారా తెలుసుకున్నారు. 24 సంవత్సరాలైనా నిండకముందే భగత్‌సింగ్ రాజకీయాలపైననే గాక, మతం, భాష, కళలు, సాహిత్యం, సంస్కృతి, ప్రేమ, సౌందర్యం, ఆత్మవిమర్శ, తదితర అనేక వర్తమాన సమస్యలపై బాగా అధ్యయనం చేసి వ్యాసాలను రాశాడు. వాటిని లభ్యమైనంతవరకూ సేకరించి, ప్రచురించడం ద్వారా భగత్‌సింగ్ వాస్తవిక వ్యక్తిత్వాన్ని నేటి మన యువతరానికి అందించాలని శివవర్మ తపించారు. ఇంక రెండు మూడు రోజుల్లో తనను ఉరితీస్తారన్న విషయం తెలిసికూడా జైలులో ఆయన లెనిన్ రచనలను అధ్యయనం చేస్తున్నట్లు కనుగొన్నారు.

అయితే శివవర్మ 1981 డిసెంబర్‌లో కంటిచూపును కోల్పోయారు. తన గాఢమైన వాంఛగా వున్న భగత్‌సింగ్ రచనలను సేకరించి ప్రచురించాలన్న లక్ష్యం ఇంక నెరవేరదనే నిరాశా నిస్పృహలతో వున్న సమయంలో అనారోగ్యంగావున్న ఆయనను పరామర్శించడానికి కామ్రేడ్ సుందరయ్య కాన్పూరు వెళ్లారు. శివవర్మ అప్పటివరకు ఉత్తరప్రదేశ్‌లో మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వుండి అనారోగ్య కారణాలతో బాధ్యత నుండి వైదొలిగారు.

కామ్రేడ్ సుందరయ్యతో సంభాషించుతున్న సమయంలో శివవర్మ తాను భగత్‌సింగ్ రచనలను సేకరించుదామనుకున్న తన తుది లక్ష్యం అంధత్వం ప్రాప్తించిన కారణంగా విఫలమైనదనే ఆవేదనను వెలిబుచ్చారు. అప్పుడు సుందరయ్య ఆయనకు ధైర్యంచెప్పి, తన ప్రయత్నాన్ని మానుకోవద్దనీ భగత్‌సింగ్ రచనలను సేకరించి, వాటిని ఎడిట్ చేసి ప్రచురించగల సామర్థ్యం, అర్హత గల వారిలో యింకా సజీవంగా మిగిలివున్నది మీరేగాబట్టి మీ కృషిని కొనసాగించవలసిందిగా ప్రోత్సాహపరిచారు. ఆయనకు సహాయపడేందుకు ఒక స్టెనోను నియమించి ఆయన ప్రయాణం తదితర పనులకు కామ్రేడ్ సుందరయ్య అవసరమైన ఏర్పాట్లు చేశారు.

తాను నిరాశ నిస్పృహలతో వున్న సమయంలో తనకు ధైర్యం చెప్పి ప్రోత్సాహమిచ్చి, తనకు అవసరమైన సహాయకరమైన ఏర్పాట్లను కామ్రేడ్ సుందరయ్య చేయకపోతే భగత్‌సింగ్ వివిధ సమస్యలపై రచించిన వ్యాసాలు వెలుగుచూసేవి కాదని శివవర్మ తెలిపారు. స్టెనోతోపాటు భగత్‌సింగ్ తమ్ముడు, మరికొంతమంది సహచరులతో వివిధ ప్రదేశాలకు వెళ్లి, ఆయన రచనలను సేకరించి, ఇంగ్లీషులో "సెలక్టెడ్ రైటింగ్స్ ఆఫ్ షాహిద్ భగత్‌సింగ్" అనే గ్రంథాన్ని తయారుచేయగలిగారు.

వివిధ పత్రికల్లో భగత్‌సింగ్ రాసిన వ్యాసాలతోపాటు ఆయన జైలులో వుండగా రాసిన నాలుగు వ్రాతప్రతులు వెలుగులోకి రాకుండా ధ్వంసం కావడం దురదృష్టకరమైన విషయం. అవి: 1) సోషలిస్టు సిద్ధాంతం, 2) భారతదేశంలో విప్లవోద్యమ చరిత్ర, 3) ఆత్మకథ, 4) మృత్యువు. ముందు ఈ నాలుగు పుస్తకాలకు సంబంధించిన వ్రాతప్రతులను రహస్యంగా జైలు నుండి బయటకు పంపించి జలంధర్‌కు చెందిన కుమారి లజ్జావతి వద్దకు భగత్‌సింగ్ చేర్చారు. వాటిని ఆమె 1938లో విజయకుమార్ సిన్హాకు అందజేశారు. (సిన్హా భగత్‌సింగ్ అనుచరుడు. అండమాన్ జైలులో శివశర్మ తదితర విప్లవకారులతో వున్నవారు. ఆతరువాత ఆంధ్ర కాంగ్రెస్ నేత అన్నే అంజయ్య కుమార్తె రాజ్యం సిన్హాను వివాహమాడారు) 1939లో ద్వితీయ ప్రపంచ యుద్ధం ఆరంభంకాగానే పోలీసులు తన యింటిని సోదాచేస్తారని, తనను అరెస్ట్ చేస్తారని సరిగ్గానే ఆయన వూహించారు. పోలీసుల కంటపడకుండా వాటిని జాగ్రత్తగా దాచివుంచవలసిందిగా ఒక మిత్రునికి ఆ వ్రాతప్రతులను సిన్హా అప్పజెప్పారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం తరువాత నిర్బంధం తీవ్రం కావడంతో ఆ మిత్రుడు కంగారుపడి ఆ వ్రాత ప్రతులను కాల్చివేశాడు.

గదర్ పార్టీకి, బబ్బర్ అకాడమీలకు చెందిన మృతవీరుల జీవిత సంగ్రహాలను కూడా భగత్‌సింగ్ రచించారు. అది హెచ్చుగా పంజాబి భాషలో రాసినవి. అవి కీర్తి పత్రికలో ప్రచురించబడినాయి. హిందీలో కూడా ఆయన నలుగురు మృతవీరులు - బాబారావ్ సింగ్ (కూలీ ఉద్యమం) సుఫీ అంబర్ ప్రసాద్, డాక్టర్ మధురసింగ్, కర్తీర్‌సింగ్ సారాబాయి జీవిత చరిత్రలను కూడా రాశారు.

ఈవిధంగా శివవర్మ తన అంధత్వాన్ని వయోభారాన్ని అధిగమించి ఉత్తర భారతంలో అనేక మందిని కలుసుకుని భగత్‌సింగ్‌కు సంబంధించి లభ్యమైన రచనలన్నింటినీ సేకరించి భగత్‌సింగ్ విప్లవ జీవితాన్ని ఆయన ప్రతిభను ప్రపంచానికి తెలియజెప్పడానికి కృషి సల్పి, తన సంకల్పాన్ని జయప్రదంగా నెరవేర్చగలిగారు.

ఇందుకు తనకు తోడ్పడిన సహచరులకు, మిత్రులకు తన కృతజ్ఞతలను తెలుపుతూ, ఈ గ్రంథం వెలువడటానికి తనకు కొండంత ప్రోత్సాహమిచ్చి సహాయపడిన కామ్రేడ్ సుందరయ్యకు ఈ పుస్తకాన్ని అంకితమిచ్చారు.

ఈ గ్రంథాన్ని "సెలక్టెడ్ రైటింగ్స్ ఆఫ్ షాహిద్ భగత్‌సింగ్" అన్న పేరుతో ఇంగ్లీషులో ఢిల్లీలోని నేషనల్ బుక్ ట్రస్టువారు ప్రచురించారు. ఇప్పుడు ఈ గ్రంథం తెలుగులో సహా అనేక భాషల్లో వెలువడింది.

ఈ రచనల సంకలనాన్ని భగత్‌సింగ్ కార్యకలాపాల్లో భాగస్వామిగా వుండి, సన్నిహితంగా పనిచేసిన శివవర్మ గ్రహించిన విషయాలనుబట్టి ఆనాటి విప్లవోద్యమాన్ని భగత్‌షింగ్ మూడు ముఖ్యమైన నినాదాలతో ఉత్తేజపరిచినట్లు తెలుస్తున్నది.

ఇవి 1) విప్లవం వర్థిల్లాలి 2) శ్రామికవర్గం వర్థిల్లాలి 3) సామ్రాజ్యవాదం నశించాలి. ఆయన మొత్తం కార్యక్రమానికి ఈ మూడు నినాదాలు స్ఫూర్తినిస్తాయి. మొట్టమొదటి నినాదం అర్థం మన దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడంలో ఆగిపోరాదని, ఒక వ్యక్తి మరో వ్యక్తి ఒక జాతిని మరోజాతి దోపిడీచేసే ఈ వ్యవస్థను రద్దు చేసేవరకూ మన సమాజంలో మౌలికమౌన సాంఘిక, ఆర్థిక,

రాజకీయ సాంస్కృతిక మార్పులను తీసుకొని వచ్చేంతవరకూ విప్లవోద్యమం కొనసాగవలసిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకనే "విప్లవం వర్ధిల్లాలి" అన్న నినాదాన్ని మొట్టమొదటగా ఎంచు కున్నారు.

ఇక రెండో నినాదం భవిష్యత్తు శ్రామికవర్గానిదే అని చెప్పడానికి ఉద్దేశించబడింది. విప్లవానికి చోదకశక్తి శ్రామికవర్గమన్న సూత్రాన్ని వ్యక్తీకరించుతుంది. ఇక మూడవ నినాదం నిర్వహించవలసిన తక్షణ కర్తవ్యాన్ని నిర్దేశించుతుంది. బానిసత్వంలో వున్న ఏ ఒక్కదేశమూ వర్గరహిత సమాజాన్ని నెలకొల్పజాలదు. దోపిడీని అంతమొందించి, మానవులందరికీ సమానమైన హక్కులను, అవకాశాలను కలుగచేయజాలదు. అందువలన ఏదేశమైనా ముందుగా తమను బానిసత్వంలో బంధించిన సామ్రాజ్యవాద ఆధిపత్యాన్నుండి విముక్తి కావలసి ఉంటుంది. కనుక ఏ బానిస దేశమైనా విప్లవం సామ్రాజ్యవాద వ్యతిరేక, వలస విధాన వ్యతిరేక స్వభావాన్ని కలిగి ఉండాలి. అందువల్లనే సామ్రాజ్యవాదం నశించాలన్న నినాదాన్ని భగత్‌సింగ్ యిచ్చారు. కేవలం మనపై పెత్తనం చేస్తున్న బ్రిటీష్ సామ్రాజ్యవాదులనే గాక మొత్తం వలస విధానం కూకటి వ్రేళ్లతో ప్రపంచంలోనే నాశనం కావాలనేదే ఆయన అభిప్రాయం. మరోమాటలో చెప్పాలంటే సంకుచిత రాజకీయ వాదానికి ఆయన వ్యతిరేకం. విశాలమైన అంతర్జాతీయ దృక్పథంతో ఆయన వ్యవహరించారు. భగత్‌సింగ్ విప్లవ స్వభావం మామూలుగా ఆలోచించే వారికి అంతగా అర్థంకాదు. ఆయన సాహసవంతమైన దేశభక్తుడనీ, లాలా లజపతిరాయ్ మృతికి కారణమైన బ్రిటీష్ ఆఫీసర్ సాండర్స్‌ను చంపి కక్ష తీర్చుకోవడం, కేంద్ర శాసనసభా భవనంలో బాంబువేసి సంచలనాన్ని సృష్టించటం ఆయన ఉద్దేశమని భావిస్తారు.

భగత్‌సింగ్ అగ్రశ్రేణికి చెందిన మేధావనీ, ముఖ్యంగా విప్లవోద్యమాన్ని మార్క్సిస్టు సిద్ధాంతంవైపుకు మరలించడానికి యత్నించిన మన దేశంలోని మొట్టమొదటి మార్క్సిస్టు సిద్ధాంత ఆలోచనా పరులలో ఒకరని చాలామందికి తెలియదు. అందువల్లనే ఆయన అభిప్రాయాలను వెల్లడించే రచనలను సేకరించి సంకలనం చేసి ప్రచురించడం అవసరమని శివవర్మ భావించి అందుకోసం కృషి చేశారు.

1897 లో స్వాతంత్ర్యం సమయంలో అడుగిడిన చాపేకార్‌ల నుండి భగత్‌సింగ్ వరకూ మన దేశంలో సాగిన విప్లవోద్యమం చరిత్రను, సిద్ధాంతరీత్యా అది చివరకు భగత్‌సింగ్, ఆయన సహచరుల చేతుల్లో మార్క్సిస్టు స్వభావాన్ని సంతరించుకున్న పరిణామాన్ని ఈ గ్రంథానికి రాసిన ఉపోద్ఘాతంలో శివవర్మ ప్రతిభావంతంగా వివరించారు. ఆ రచనల సంకలనానికి సంబంధించిన గ్రంథానికి ఆయన రాసిన చారిత్రక ఉపోద్ఘాతాన్ని ఈ వ్యాస రచయిత "టెర్రరిజం నుండి మార్క్సిజం వరకు భారత విప్లవోద్యమ సైద్ధాంతిక పరిణామ క్రమం" అన్న శీర్షికతో అనువదించి ప్రచురించారు. అలాగే భగత్‌సింగ్ జైలులో వుండగా ఆయన రచించిన "నేనెందుకు నాస్తికుడను" అన్న వ్యాసాన్ని పుస్తకరూపంలో భారత దేశంలో విప్లవ సాధన పట్ల భగత్‌సింగ్ అవగాహనను తెలిపే ఆయన రాసిన మరో వ్యాసాన్ని తెనిగించి పుస్తకరూపంలో "భగత్‌సింగ్ వీలునామా" అనే పేరుతో ప్రచురించారు.

కనుక భగత్‌సింగ్ ప్రతిభను వ్యక్తిత్వాన్ని గురించి తెలుసుకోవాలంటే శివవర్మ సేకరించిన భగత్‌సింగ్ రచనల సంకలనాన్ని దేశభక్తులైన నేటి యువతీయువకులు చదవడం అవసరం.



MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2003-05

